thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

భారత్ కు డబ్ల్యూటీసీలో ఐదో స్థానం



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 101 | జగిత్యాల శుక్రవారం 10 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## పీఓకేలో ఉద్రిక్తతలు పతాకస్థాయికి



- పాక్ ప్రభుత్వానికి 48 గంటల అల్టిమేటమ్
- 38 డిమాండ్లతో జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ హెచ్చరిక
- నామినేటెడ్ అసెంబ్లీ స్థానాలపై తీవ్ర అభ్యంతరం

4

## మరోమారు కోవిడ్ కలవరం



- రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి
- అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ

4

## న్యూజిలాండ్ పర్యటనకు మోదీ

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన



4

# ఒలింపిక్సే మన లక్ష్యం

### 2036లో క్రీడల నిర్వహణకు సన్నాహాలు

### సీఎం ఆకాంక్ష



## 2026లో ఖేలో ఇండియా క్రీడలు

- గచ్చిబౌలిలో స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభం
- లాంఛనంగా ప్రారంభించిన పీటీ ఉష
- ప్రముఖులతో పాలక మండలి ఏర్పాటు
- ఆరుగురు క్రీడాకారులకు భారీ నజరానా
- ప్రతిభ చూపితే ప్రభుత్వ ఉద్యోగం
- సీఎం రేవంత్ రెడ్డి హామీ

2036లో ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ క్రీడలకు హైదరాబాద్ వేదిక కావాలన్న బలమైన ఆకాంక్షను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు. తెలంగాణ క్రీడా వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి గచ్చిబౌలి వేదికగా ఆయన శ్రీకారం చుట్టారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇస్తూనే.. ఆరుగురు తెలంగాణ క్రీడాకారులకు రూ. 7.15 కోట్ల భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

వివరాలు 2లో..

# కొండా వర్సెస్ కడియం!

- వరంగల్ కాంగ్రెస్‌లో వర్గపోరు!
- దేవాదాయ శాఖపై ఎమ్మెల్యే సమీక్ష
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి
- టీపీసీసీ చీఫ్‌కు సురేఖ ఫిర్యాదు
- ఇద్దరితో మాట్లాడతామన్న మహేశ్ గౌడ్

3







## దేశంలో అగ్రస్థానంలో తెలంగాణ

- కాలుష్య రహిత హైదరాబాద్!
- 2034 నాటికి అద్భుత ప్రగతి
- విజన్ 2047 లక్ష్యంగా ప్రణాళికలు

2

- ఓఆర్ఆర్ బయటకు పారిశ్రామిక వాడలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సీతారాంపూర్‌లో సోలార్ యూనిట్ ప్రారంభం

# బీఆర్ఎస్ ఖాతాలో 1,400 కోట్లు



- అమరులకు, బలిదానాల కుటుంబాలకు పంపిణీ చేయాలి
- సింగరేణిలో మెడికల్ బోర్డు కోరుతూ 20 నుంచి నిరాహార దీక్ష
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

.. వివరాలు 3లో

## రైతన్నకు పెద్ద పీట!

- వ్యవసాయానికి ప్రాధాన్యం
- విపత్తుల్లోనూ రైతన్నకు సాయం
- అన్నదాతల ఖాతాల్లో 35 వేల కోట్లు
- నేడు ఖమ్మంలో మెగా రైతు మేళా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వివరాలు 3వ పేజీలో

## హరీశ్‌పై నమ్మకం లేదు!

- కేసీఆర్ ఎందుకు తప్పించారో చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శలు
- ఎల్ నినోపై ప్రభుత్వ అప్రమత్తత
- రైతులు ఆందోళన చెందొద్దని భరోసా
- ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తాం



వివరాలు 2వ పేజీలో

## బండి భగీరథ్‌కు బెయిల్

- పోక్సో కేసులో ఊరటనిచ్చిన న్యాయస్థానం
- 45 రోజులుగా జైలులోనే రిమాండ్
- దర్యాప్తునకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

3





## రేవంత్ సర్వేలో షాక్!

కాంగ్రెస్ పార్టీకి తప్పని పరాభవం
ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే ఓటమే

- బీఆర్ఎస్ పార్టీకి 78 స్థానాలు
- మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్
- దొంగ ఓట్లపై నిఘా పెట్టాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3

## కాంగ్రెస్ ఏటీఎం

- అవినీతికి కేరాఫ్‌గా రేవంత్ సర్కారు
- కాళేశ్వరం, డబుల్ ఇళ్లలో మోసం
- దేశాన్ని మార్చేసిన మోదీ పాలన
- వారసత్వ రాజకీయాలకు ముగింపు

మేధావుల సమావేశంలో జేపీ నడ్డా

3



## ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు
కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం

4



చురకలు



# కొండా వర్సెస్ కడియం!

**వరంగల్ కాంగ్రెస్‌లో వర్గపోరు.. దేవాదాయ శాఖపై ఎమ్మెల్యే సమీక్ష**

**తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. టీపీసీసీ చీఫ్‌కు సురేఖ ఫిర్యాదు**

**ఇద్దరితో మాట్లాడతామన్న మహేశ్ గౌడ్**





**వరంగల్, జూలై 9 :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. దేవాదాయ శాఖ వ్యవహారాల్లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా జోక్యం చేసుకుంటున్నారంటూ మంత్రి కొండా సురేఖ నేరుగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇద్దరు నేతలతో మాట్లాడి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు పార్టీలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు ఈ పరిస్థితి కొండా సురేఖ వర్సెస్ కడియం శ్రీహరి లాగా మారింది. మంత్రి కొండా పనితీరుపై స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాదాయ శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ నేతల్లోనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## టీపీసీసీకి చేరిన పంచాయతీ..

ఈ వివాదం కాస్తా ఇప్పుడు టీపీసీసీ దృష్టికి చేరింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఆరోపించారు. ఇది ప్రభుత్వ ప్రొటోకాల్‌కు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఆమె లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## ఉపేక్షించేది లేదన్న అధిష్ఠానం..

ఈ ఫిర్యాదుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న గ్రూపు రాజకీయాలపై పార్టీ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. కొండా సురేఖ, కడియం శ్రీహరి ఇద్దరితో త్వరలోనే మాట్లాడి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని ఆయన హితవు పలికారు. అలాంటి చర్యలను పార్టీ ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై అవసరమైన కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన గట్టిగా హెచ్చరించారు.

# బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

**సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కెసిఆర్ నిర్ణయం**

**హైదరాబాద్, జూలై 9:** రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్ గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ము-ంగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధ్యలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

# స్పీకర్, మండలి చైర్మన్‌తో సిఎస్ భేటీ

**హైదరాబాద్, జూలై9:** తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, జూలై9:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా.. రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

# ఒలింపిక్సే మన లక్ష్యం!

- 2036లో క్రీడల నిర్వహణకు సన్నాహాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష
- 2026లో ఖేలో ఇండియా క్రీడలు
- గచ్చిబౌలిలో స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభం
- లాంఛనంగా ప్రారంభించిన పీటీ ఉష
- ప్రముఖులతో పాలక మండలి ఏర్పాటు
- ఆరుగురు క్రీడాకారులకు భారీ నజరానా
- ప్రతిభ చూపితే ప్రభుత్వ ఉద్యోగం
- సీఎం రేవంత్ రెడ్డి హామీ



**గచ్చిబౌలి జూలై 9 :** 2036లో ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ క్రీడలకు హైదరాబాద్ వేదిక కావాలన్న బలమైన ఆకాంక్షను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు. తెలంగాణ క్రీడా వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి గచ్చిబౌలి వేదికగా ఆయన శ్రీకారం చుట్టారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇస్తూనే.. ఆరుగురు తెలంగాణ క్రీడాకారులకు రూ. 7.15 కోట్ల భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. గచ్చిబౌలి స్టేడియం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి శుభారంభం పలికారు. క్రీడలను ప్రోత్సహించాలన్న బలమైన ఆకాంక్షతో ఈ వర్సిటీని స్థాపించడం పట్ల పీటీ ఉష ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. స్పష్టమైన క్రీడా విధానం లేకపోవడం వల్లే దేశం వెనుకబడిపోయిందని, అందుకే తెలంగాణలో నూతన క్రీడా పాలసీని తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీహరి, క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి, పలువురు క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.

## వర్సిటీకి పూర్తి స్వేచ్ఛ..

82 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో స్పోర్ట్స్ యూనివర్సిటీని, ప్రపంచ స్థాయి అకాడమీని నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2028 డిసెంబరులో ఈ వర్సిటీని ప్రారంభించుకోబోతున్నట్లు వెల్లడించారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో నెలకొల్పిన ఈ సంస్థలో ప్రభుత్వ జోక్యం ఏమాత్రం ఉండదన్నారు. సంజీవ్ గోయెంకా, అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, కావ్యా మారన్, ఉపాసన కొణిదెల, రవికాంత్ రెడ్డి లాంటి ప్రముఖులతో బోర్డును ఏర్పాటు చేసి పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు వివరించారు. 23 ఏళ్ల కిందట నిర్మించిన స్టేడియాలు ఆ తర్వాత రాజకీయ కార్యక్రమాలకు వేదికగా మారాయని, వాటన్నింటినీ పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు.

## భారీ నగదు ప్రోత్సాహకాలు..

వివిధ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఆరుగురు క్రీడాకారులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ. 7.15 కోట్ల నగదు బహుమతులు అందించారు. ప్యారా అథ్లెటిక్స్ చాంపియన్ దీప్తి జీవాంజికి రూ. 50 లక్షలు, డెఫ్లింపిక్స్ షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు రూ. 2.10 కోట్లు, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ విజేత ఇషా సింగ్‌కు రూ. 3.30 కోట్లు, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ. 60 లక్షలు, షూటర్లు తనిష్క్ మురళీధర్ నాయుడుకు రూ. 53.65 లక్షలు, రావూరి సురభి భరద్వాజ్‌కు రూ. 10 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు.

## నిర్వహించనున్న ప్రతిష్టాత్మక టోర్నీలు..

2026లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 8వ ఎడిషన్ క్రీడలతో పాటు, జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ టోర్నమెంట్స్ నిర్వహించబోతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. హాకీ ఇండియా లీగ్, ప్రపంచ పికిల్ బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుందని స్పష్టం చేశారు. ఇదే వేదికగా 'తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

# దేశంలో అగ్రస్థానంలో తెలంగాణ

- కాలుష్య రహిత హైదరాబాద్!
- 2034 నాటికి అద్భుత ప్రగతి
- విజన్ 2047 లక్ష్యంగా ప్రణాళికలు
- ఓఆర్ఆర్ బయటకు పారిశ్రామిక వాడలు
- ముఖ్యమంత్రి రేవంత్
- సీతారాంపూర్‌లో సోలార్ యూనిట్ ప్రారంభం



**సీతారాంపూర్, జూలై 9 :** హైదరాబాద్ మహానగరాన్ని పూర్తిగా కాలుష్య రహితంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ నగరం వెలుపలికి తరలించేందుకు ఇప్పటికే చట్టం చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో ఏర్పాటు చేసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. సోలార్ మాడ్యూల్స్ తయారీ రంగంలో ప్రసిద్ధ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్.. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో 5.6 గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రీమియర్ ఎనర్జీ రూపొందించిన మొట్టమొదటి సోలార్ ఆక్సీ ట్రీ (ఎయిర్ క్లీనింగ్ సిస్టమ్), ఇతర ఉత్పత్తులను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోని కారణంగానే ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై లాంటి మెట్రోపాలిటన్ నగరాలు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నాయని గుర్తుచేశారు.

## ఓఆర్ఆర్ వెలుపలికి పరిశ్రమలు..

గత నగరాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సీఎం సూచించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని జీడిమెట్ల, బాలానగర్ లాంటి ప్రాంతాల్లోని పరిశ్రమలతో పాటు, మూసీ నది కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే 2,100 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ లోపల.. 1 కోటి 35 లక్షల జనాభా అవసరాలకు అనుగుణంగా పూర్తిగా కాలుష్య రహిత ప్రాంతంగా మార్చాలని సంకల్పించినట్లు తెలిపారు. ఇక్కడి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయట పెరి అర్బన్ రీజియన్‌లో ఏర్పాటు చేసిన మాన్యుఫాక్చరింగ్ జోన్‌కు తరలించి, అక్కడ అవసరమైన స్థలాలు కేటాయిస్తామని వివరించారు. కేవలం 12 నెలల కాలంలోనే ఇక్కడ తొలి యూనిట్‌ను నెలకొల్పిన ప్రీమియర్ ఎనర్జీస్ యాజమాన్యాన్ని సీఎం అభినందించారు.

## 2034 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీ..

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే 3 ప్రాంతీయ మండళ్లుగా విభజించి సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు. 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం అని స్పష్టం చేశారు. 2047 నాటికి 100 సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకోబోతున్న తరుణంలో హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రావాలన్నారు. యువత కేవలం వైట్ కాలర్ ఉద్యోగాల కోసమే కాకుండా.. బ్లూ కాలర్ జాబ్స్ అందిపుచ్చుకునే దిశగా నైపుణ్యాలను పెంచడంపై దృష్టి సారించామన్నారు.

## ప్రజల సహకారం కావాలి..

నైపుణ్యాల పెంపు కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి వ్యవస్థలను సిద్ధం చేస్తున్నట్లు సీఎం తెలిపారు. పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించడానికి సోలార్ ఎనర్జీతో ఆక్సిజన్ పంపింగ్ చేసే యంత్రాలను ప్రీమియర్ ఎనర్జీ రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టి, కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని.. దానికి ప్రజల సంపూర్ణ సహకారం కావాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రీమియర్ ఎనర్జీ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా, డైరెక్టర్ సుధీర్ మూల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతి రోహిణి, ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# హరీశ్‌పై నమ్మకం లేదు!

- కేసీఆర్ ఎందుకు తప్పించారో చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శలు
- ఎల్ నినోపై ప్రభుత్వ అప్రమత్తత
- రైతులు ఆందోళన చెందొద్దని భరోసా



**హైదరాబాద్, జూలై 9 :** ఇరిగేషన్ అంశాల్లో హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే.. గతంలో కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి ఎందుకు తప్పించారో చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్‌కు నమ్మకం లేకే ఆయనను పక్కన పెట్టారని విమర్శించారు. సచివాలయంలో ఎల్ నినో పరిస్థితులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన ఆయ[illegible] [illegible]తులకు అండగా ఉండేందుకు కార్యాచరణ సిద్ధ[illegible] భరోసా ఇచ్చారు. సచివాలయంలో గురువారం మీడియాతో చిట్‌చాట్ చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్ శాఖపై అంత పట్టున్న నాయకుడిని కేసీఆర్ ఎందుకు తప్పించారని నిలదీశారు. ఇప్పుడు ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలంటున్నారని, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లు ఆయన తమ పార్టీలో చేరుతారా అని ఉత్తమ్ ప్రశ్నించారు. హరీశ్ రావు విమర్శలపై సరైన సమయంలో పూర్తిస్థాయిలో సమాధానం చెబుతామన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో డ్యామేజీల మరమ్మతులను వచ్చే వేసవి నాటికి పూర్తి చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

## ఎల్ నినోపై అప్రమత్తం..

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులకు ఉత్తమ్ ఆదేశాలు జారీ చేశారు. వర్షాభావ పరిస్థితుల పట్ల రైతులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు.

## గ్రామసభల ద్వారా అవగాహన..

గ్రామసభల ద్వారా ఎల్ నినోపై రైతుల్లో చైతన్యం కల్పిస్తామని మంత్రి వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇస్తామని చెప్పారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, సాగునీటి వినియోగాన్ని శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని, ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రైతులు వదంతులను నమ్మవద్దని, అధికారుల సూచనలు పాటించాలని ఆయన కోరారు. ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# రైతన్నకు పెద్ద పీట!

- కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి ప్రాధాన్యం
- విపత్తుల్లోనూ రైతన్నకు పూర్తి సాయం
- అన్నదాతల ఖాతాల్లో 35 వేల కోట్లు
- నేడు ఖమ్మంలో మెగా రైతు మేళా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూలై 9 :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులకు జరిగిన అన్యాయాన్ని ఎండగడుతూ.. కేవలం రెండున్నర నెలల్లోనే 35 వేల కోట్ల రూపాయలను అన్నదాతలకు అందజేశామని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళాలో ఆయన పాల్గొన్నారు. ఇదే పర్యటనలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. జగన్నాధపురంలో 2 రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 9 రోజుల్లోనే 8,759 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మరో 1,900 కోట్లను త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించారు. శుక్రవారం నిర్వహించే రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని, అన్నదాతలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

### బీఆర్ఎస్ మోసాలను నమ్మొద్దు..

పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పంట నష్టపోతే ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని భట్టి విమర్శించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు నేటికీ పటిష్టంగా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టుల పరిస్థితి ఏంటో ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. 2023 ఎన్నికల ఫలితాలే బీఆర్ఎస్ పతనానికి నిదర్శనమన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, రైతులు తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ఆరుతడి, పప్పుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. సీతారామ, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీరు విడుదల చేస్తున్నామని, రైతులకు ఎరువుల కొరత లేకుండా యాప్ ద్వారా పంపిణీ చేస్తున్నామని వివరించారు.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..

సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. చింతకాని మండలం లచ్చగూడెంలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆయనకు వినతిపత్రం అందజేసింది. దీనిపై భట్టి సానుకూలంగా స్పందిస్తూ.. సొసైటీల ద్వారా స్థలాల కేటాయింపులో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయన్నారు. వ్యక్తిగతంగా లేదా బీపీఎల్ కోటాలో స్థలాలు ఇచ్చే మార్గాలను పరిశీలిస్తామన్నారు. గత ప్రభుత్వం 23 ఎకరాల భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసినా అమలుకు నోచుకోలేదని ఆయన గుర్తుచేశారు. ఈ సమస్యపై త్వరలోనే సీఎంను కలిసి నిర్దిష్టమైన గడువుతో ప్రకటన వచ్చేలా చూస్తానని విలేకరులకు భరోసా ఇచ్చారు.

# బీఆర్ఎస్ ఖాతాలో 1,400 కోట్లు

- అమరులకు, బలిదానాల కుటుంబాలకు పంపిణీ చేయాలి
- మెడికల్ బోర్డు కోరుతూ 20 నుంచి నిరాహార దీక్ష
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



**కొత్తగూడెం, జూలై 9 :** బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న 1,400 కోట్ల రూపాయలను తెలంగాణ అమరుల కుటుంబాలకు పంపిణీ చేసి ఆ పార్టీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించిన ఆమె మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులపై అవినీతి ఆరోపణలు గుప్పించారు. సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న 1,400 కోట్లు క్విడ్ ప్రో కో ద్వారా వచ్చినవే అని ఆమె ఆరోపించారు. ఆ నిధులను వెంటనే అమరుల కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా వాళ్లు ఎన్నో కుట్రలు చేస్తున్నారని, ఈసీకి వేల ఫిర్యాదులు చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి నీతినియమాలు లేవని, సోషల్ మీడియాలో మహిళల పట్ల అసభ్యంగా పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు.

### అవినీతి ఆరోపణల జల్లు..

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిలో మాజీ మంత్రి హరీశ్ రావు పాత్ర ఉందని కవిత ఆరోపించారు. మూడు నెలల మంత్రి పదవి కోసం ఆయన ఎన్నో మరకలు అంటించుకున్నారని విమర్శించారు. ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌కు కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారని, 188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రికను సైతం కొనుగోలు చేశారని ఆరోపించారు. ఫీనిక్స్ సంస్థకు 80 వేల కోట్ల విలువైన భూములను కట్టబెట్టారని, ఆ సంస్థ ఏకంగా 33 లక్షల టన్నుల కలపను కొట్టుకుపోయిందని ధ్వజమెత్తారు. తన పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు కుమ్మక్కయ్యారని ఆమె విమర్శించారు.

### సింగరేణి గనిలో పర్యటన..

కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 భూగర్భ గనిని కవిత సందర్శించి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికుల పట్ల ప్రేమ ఉంటే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని సవాల్ విసిరారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు హెచ్ఎంఎస్ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని కవిత భరోసా ఇచ్చారు.

# రేవంత్ సర్వేలో షాక్!

- కాంగ్రెస్ పార్టీకి తప్పని పరాభవం
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే ఓటమే
- బీఆర్ఎస్ పార్టీకి 78 స్థానాలు
- మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జూలై 9 :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ కాంగ్రెస్ పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 78 సీట్లతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆ సర్వేల్లో తేలిందని ఆయన వెల్లడించారు. మరోవైపు జీహెచ్ఎంసీ పరిధిలో జరుగుతున్న ఓటరు నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియలో అధికార కాంగ్రెస్, బీజేపీలు దొంగ ఓట్లు నమోదు చేసే ప్రమాదం ఉందని, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో తన పరిపాలన, నాయకత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విస్తృత సర్వే చేయించుకున్నారని కేటీఆర్ తెలిపారు. అందులో కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తమైందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 78 సీట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందని చెప్పారు. రెండు మీడియా సంస్థలు, కేంద్ర రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన సర్వేల్లోనూ ఇదే అంశం వ్యక్తమైందని, కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన ప్రస్తావించారు. ఆ సర్వేల్లో వచ్చిన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే వారం రోజులుగా ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

### డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు..

పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాళేశ్వరం నుంచి రైతుబంధు వరకు అన్నీ అబద్ధాలే ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందుకే సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పై నమ్మకం కోల్పోయాయన్నారు. కాంగ్రెస్ పార్టీ జారుడు బండపై నిలబడిందని, ఇక పుంజుకునే అవకాశమే లేదన్నారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, బీజేపీకి అవకాశం ఇవ్వడానికి ఏమాత్రం సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

### దొంగ ఓట్లపై నిఘా పెట్టాలి..

జీహెచ్ఎంసీ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై పార్టీ నేతలు ప్రత్యేక దృష్టి సారించాలని కేటీఆర్ సూచించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగిన సమావేశంలో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇన్‌చార్జిలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం నియమించిన బీఎల్ఓలకు కనీస శిక్షణ లేకపోవడంతో ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత మందకొడిగా సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న రాజ్యాంగ స్ఫూర్తితో దొంగ ఓట్లు లేకుండా చూడాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బయటపడిన దొంగ ఓట్ల వ్యవహారాన్ని ప్రతి నాయకుడు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్నందున ఇతర ప్రాంతాల వారిని ఇక్కడ ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. అలాంటి కుట్రలను తిప్పికొడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు, మద్దతుదారుల ఓట్లు గల్లంతు కాకుండా బీఎల్ఏల సహకారంతో ఎప్పటికప్పుడు జాగ్రత్త పడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో వస్తున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తున్నామని ఆయన భరోసా ఇచ్చారు.

# బండి భగీరథ్‌కు బెయిల్!

### పోక్సో కేసులో ఊరటనిచ్చిన న్యాయస్థానం
### 45 రోజులుగా జైలులోనే రిమాండ్
### దర్యాప్తునకు సహకరించాలని హైకోర్టు ఆదేశం
### సాక్షులను ప్రభావితం చేయొద్దన్న కోర్టు

**హైదరాబాద్, జూలై 9 :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. పోక్సో కేసులో అరెస్టై 45 రోజులకు పైగా జైలులో ఉన్న అతడికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టు నిబంధనలకు కట్టుబడి ఉంటూ.. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశిస్తూ జస్టిస్ కె. సుజన ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్‌లోని పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. మే 16న అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు పూర్తికావడంతో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. తాజాగా బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం అతడిని ఆదేశించింది.

### వాదనలు ఇలా..

పిటిషనర్ తరఫు న్యాయవాది టి. నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. భగీరథ్ ఒక విద్యార్థి అని, 45 రోజులకు పైగా జైలులో ఉండటంతో తన భవిష్యత్తును కోల్పోతున్నాడని కోర్టు దృష్టికి తెచ్చారు. పరస్పర అంగీకారంతో జరిగిన ఘటనలపై కేసులు నమోదు చేయడం చెల్లదని గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టులు ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కచ్చితంగా కట్టుబడి ఉంటారని తెలిపారు. మరోవైపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందని చెప్పారు. కేసు దర్యాప్తు దాదాపు పూర్తయిందని, గడువులోగా ఛార్జిషీట్ దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన.. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# కాంగ్రెస్ ఏటీఎం

### అవినీతికి కేరాఫ్‌గా రేవంత్ సర్కారు.. కాళేశ్వరం, డబుల్ ఇళ్లలో మోసం
### దేశాన్ని మార్చేసిన మోదీ పాలన.. వారసత్వ రాజకీయాలకు ముగింపు
### మేధావుల సమావేశంలో జేపీ నడ్డా




**హైదరాబాద్, జూలై 9 :** తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ తనకు ఏటీఎంగా మార్చుకుందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కారు ప్రజాధనాన్ని అభివృద్ధి కోసం కాకుండా కేవలం రాజకీయ స్వార్థం కోసమే వాడుకుంటోందని మండిపడ్డారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయవాద మేధావుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాళేశ్వరం, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పథకాల్లో జరిగిన అవినీతిని ఎండగడుతూనే.. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సాధించిన అద్భుత ప్రగతిని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ఫోరమ్ ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన మేధావుల సమావేశంలో జేపీ నడ్డా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారిపోయిందని ఆయన విమర్శించారు. ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పథకాల అమలులో తీవ్రమైన అవినీతి జరిగిందని, ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే పార్టీ కాదని, నిరంతరం ప్రజలకు సేవ చేసే పార్టీ అని నడ్డా స్పష్టం చేశారు.

### రిపోర్ట్ కార్డ్ పాలిటిక్స్ మాది..

గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ భారత రాజకీయ ముఖచిత్రాన్ని, ప్రజాస్వామ్య నిర్వచనాన్ని పూర్తిగా మార్చేశారని నడ్డా కొనియాడారు. 2014 తర్వాత కుటుంబ, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలకు చరమగీతం పాడి కేవలం అర్హతకే పెద్దపీట వేశామన్నారు. అందరికీ న్యాయం అనే లక్ష్యంతో సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అన్న స్ఫూర్తిని ఆచరణలో చూపిస్తున్నామని చెప్పారు. ప్రజల ముందుకు వెళ్లి చేసిన పనులను ధైర్యంగా చెప్పగలిగే రిపోర్ట్ కార్డ్ పాలిటిక్స్ తమదేనని ఆయన స్పష్టం చేశారు.

### ప్రపంచానికి ఫార్మసీగా భారత్..

ఒకప్పుడు ఫ్రాజైల్ ఫైవ్ అని పిలిచిన మోర్గాన్ స్టాన్లీ, ఇప్పుడు రాబోయే దశాబ్దం భారతదేశానిదే అని కీర్తిస్తోందని నడ్డా గుర్తుచేశారు. ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ లాంటి సంస్థలు సైతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మన దేశాన్ని గుర్తించాయన్నారు. 2027 నాటికి జీడీపీ వృద్ధి రేటు 6.6 శాతం, 2028 నాటికి 7.2 శాతంగా ఉంటుందని వరల్డ్ బ్యాంక్ అంచనా వేసిందన్నారు. దళారుల వ్యవస్థను రద్దు చేసి, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే 51 లక్షల కోట్లు బదిలీ చేశామని, తద్వారా 4.3 లక్షల కోట్ల అవినీతిని అరికట్టామని చెప్పారు. ప్రస్తుతం 191 దేశాలకు 2.6 లక్షల కోట్ల విలువైన ఔషధాలను ఎగుమతి చేస్తూ ప్రపంచానికే ఫార్మసీగా మారామని స్పష్టం చేశారు.

### ఎలక్ట్రానిక్స్‌లో అనూహ్య వృద్ధి..

గత పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి 500 శాతం, ఎగుమతులు 700 శాతం పెరిగాయని మంత్రి వివరించారు. మొబైల్ ఫోన్ల తయారీలో ఏకంగా 2700 శాతం వృద్ధి సాధించామని, ఒకప్పుడు కేవలం 18 వేల కోట్లుగా ఉన్న ఎగుమతులు ఇప్పుడు 5.5 లక్షల కోట్లకు చేరాయని తెలిపారు. సేవా రంగంలో 263 శాతం వృద్ధి సాధించామని, గ్లోబల్ షిప్ రీసైక్లింగ్ రంగంలో 35 శాతం వాటా మనదేనని చెప్పారు. దేశంలో ఉన్న 2.3 లక్షల స్టార్టప్ ల ద్వారా కొత్తగా 25 లక్షల ఉద్యోగాలను సృష్టించామని, ఇదే నవ భారతదేశ అభివృద్ధి చిత్రమని జేపీ నడ్డా వివరించారు.



# గందరగోళంలో వ్యవసాయం

## ఎల్‌నినో ముప్పుతో అన్నదాతల తీవ్ర ఆందోళన

## జూలై మధ్యకు వచ్చినా కరువైన వర్షాలు

## ఎండిపోతున్న నార్లు.. దిక్కుతోచని స్థితిలో రైతాంగం

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎల్‌కనినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన డంతో రైతు కుదేలవుతున్నాడు. మ-రోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.

# పీఓకేలో ఉద్రిక్తతలు పతాకస్థాయికి


- పాక్ ప్రభుత్వానికి 48 గంటల అల్టిమేటమ్
- 38 డిమాండ్లతో జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ హెచ్చరిక
- నామినేటెడ్ అసెంబ్లీ స్థానాలపై తీవ్ర అభ్యంతరం



**ఢిల్లీ, జూలై 9:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో రాజకీయ ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. పాక్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తమ డిమాండ్లను 48 గంటల్లోగా అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పాక్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. పీఓకే అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూనే రాజకీయంగా తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు పాక్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జేఏఏసీ ఆరోపించింది. ముఖ్యంగా పీఓకే అసెంబ్లీలోని 12 నామినేటెడ్ స్థానాలను పాక్ నుంచి వలస వచ్చిన వారి కోసం కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పాక్ నుంచి వలస వచ్చిన సుమారు 4.36 లక్షల మంది ఓటర్ల కోసం 12 అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తుండగా, పీఓకేలోని 33 లక్షల మంది స్థానిక ఓటర్లకు కేవలం 33 స్థానాలే ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని జేఏఏసీ విమర్శించింది. ఈ నామినేటెడ్ స్థానాలకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందని పాక్ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ స్థానాలను వెంటనే రద్దు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేసింది. అలాగే నిలిచిపోయిన జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చలు పునఃప్రారంభించడం, నిత్యావసర వస్తువులపై సబ్సిడీలు పెంచడం, విద్యుత్ చార్జీలు తగ్గించడం సహా మొత్తం 38 డిమాండ్లను ప్రభుత్వానికి సమర్పించింది. ఇదిలా ఉండగా, జూలై 27న పీఓకే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం నుంచి అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జేఏఏసీ ఈ అల్టిమేటమ్ జారీ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పాక్ ప్రభుత్వం ఈ డిమాండ్లపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# న్యూజిలాండ్ పర్యటనకు మోదీ

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన




**ఆక్లాండ్/న్యూఢిల్లీ, జూలై 9:** భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనకు ఒక రోజు ముందు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడంతో న్యూజిలాండ్ నుంచి భారత్‌కు ఎగుమతి అయ్యే 57 శాతం ఉత్పత్తులపై తొలి రోజే దిగుమతి సుంకాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంతో న్యూజిలాండ్ ఎగుమతిదారులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలు ముగించుకుని ప్రధాని మోదీ జూలై 10న ఆక్లాండ్ చేరుకోనున్నారు. గత 40 ఏళ్లలో భారత ప్రధాని అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వచ్చే 95 శాతం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను దశలవారీగా తొలగించనున్నారు. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్-న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యం 1.3 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరగా, 2024లో సేవల రంగంతో కలిపి ఇది 2.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో ప్రయాణ, సమాచార సాంకేతిక, వ్యాపార సేవలు కీలక పాత్ర పోషించాయి. మోదీ-లక్సన్ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే భారత 'యాక్ట్ ఈస్ట్' విధానం, 'మహాసాగర్' దృష్టికోణం, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి సంబంధించి కూడా కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. ప్రధాని మోదీ ఈ పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

## రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి

## అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ



**తిరుపతి, జూలై 9:** కోవిడ్ మరోమారు కలవర పెడుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్టు సమాచారం.కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి (52) తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. నిమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా 26వ తేది పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్యశాఖ అప్రమత్త మైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశాం. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదుకాలేదు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. కరోనాతో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# స్థిరంగా బంగారం

**హైదరాబాద్, జూలై 9:** అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుదల నమోదు చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,43,120గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,31,190గా ఉంది.మరోవైపు వెండి ధరల్లో కూడా స్వల్ప తగ్గుదల నమోదైంది. కిలోకు వంద రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,44,900గా ఉంది.



# ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

## దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు

## కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం

**వాషింగ్టన్, జూలై 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన పక్రియలో కొనసాగుతోంది.

చురకలు



# అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలి






## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 09 :**

ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికలు, కార్యాలయ రికార్డులు, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివరాల నమోదు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారులు, సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించాలని తెలిపారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని, జూలై 24వ తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలలో పొందుపరిచిన సమాచారాన్ని బిఎల్ఓ యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులుగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూభారతి పెండేసి వివరాలను పరిశీలించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం నెన్నెల మండలం ఆవడం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహశీల్దార్ శ్రీనివాస్ తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం పథకం అమలు, సైన్స్ వేర్ నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, భోజనశాల, అదనపు గదులు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా విద్యారంగంలో దేశంలో, రాష్ట్రంలో ఉన్నత స్థానాలలో నిలిచిందని, జిల్లాలో దాదాపు 320 మంది ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, అడ్మిషన్లలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో 3 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగిందని, ఒక గుర్తింపు ద్వారా 75 శాతం హాజరు నమోదు అవుతుందని తెలిపారు. జిల్లాలో 700 లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలలో దాదాపు 44 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో సకల సౌకర్యాలతో విద్యార్థులకు విద్యా అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో విద్యారంగంలో 150 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, ఇందులో సిఎస్ఆర్ 80 కోట్ల రూపాయలు, ఈజిఎస్ 20 కోట్ల రూపాయలు, సమగ్ర శిక్ష 11 కోట్ల రూపాయలు, నాబార్డు 6 కోట్ల రూపాయలు, ప్రధానమంత్రి జన్ మన్ 3 కోట్ల రూపాయలు, ప్రధానమంత్రి జుగా 3 కోట్ల రూపాయలతో పాటు ప్రభుత్వ నిధులతో పాఠశాలల అభివృద్ధి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలతో పాఠశాలలలో అడ్మిషన్లు అడుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శన

## చార్మినార్ జోన్ డీఐజీ ఎల్. ఎస్. చౌహాన్

**వికారాబాద్, జులై,09**



వికారాబాద్: చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహన్ వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని (DPO) సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న డీఐజీ గారికి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం డీఐజీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం ఇటీవల పునరుద్ధరించిన (రీనోవేషన్) ఎస్పీ ఛాంబర్‌ను డీఐజీ ప్రారంభించి పరిశీలించారు. తదనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ విభాగాలైన డీపీఓ సెక్షన్లు, డీసీఆర్‌బీ (DCRB), డీఎస్‌బీ (DSB), డీఏఆర్ (DAR), పరిపాలనా శాఖలు, రికార్డు విభాగాలు, ఆయుధాగారం, సిబ్బంది నిర్వహణకు సంబంధించిన విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయా శాఖల్లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నిర్వహణ, పరిపాలనా విధానాలు, ఫైళ్ల నిర్వహణ, సేవా రికార్డులు, కార్యాలయ నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, "జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్ని విభాగాల పనితీరును పరిశీలించడం జరిగింది. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, ఫైళ్ల భద్రపరచడం, పరిపాలనా విధానాలు సక్రమంగా ఉండటం ప్రతి పోలీసు అధికారికి ఎంతో ముఖ్యం. ప్రతి శాఖలో రిజిస్టర్లు, రికార్డులు, కేసు సంబంధిత ఫైళ్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలి.కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, పరిశుభ్రత, సమయపాలనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను జాప్యం లేకుండా సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కార్యాలయ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచాలి. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా ప్రతి అధికారి తన బాధ్యతలను నిర్వర్తించాలి అని డీఐజీ తెలియజేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా , IPS, జిల్లా డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్,DAR డిఎస్‌పి వీరేశ్ అధికారులు ,ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐ లు,ఎస్సై లు,ఆర్ఎస్ఐ లు , సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి

- సైబర్ నేరానికి గురైతే 1930 కి సమాచారం ఇవ్వాలి

**నారాయణపేట,జులై,09**




ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి సూచించారు.నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొల్లంపల్లి గ్రామంలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంతో పాటు గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలీస్ వాల్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ నేరాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్లు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు.సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద లింకులు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడులు, లాటరీలు, కూరియర్, కేవైసీ అప్‌డేట్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.పోలీసులు ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు గ్రామాలలో నూతనంగా పోలీసు వాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను త్వరగా పొందేందుకు పోలీస్ వాల్ ఎంతో ఉపయోగపడుతుందని, ఇందులో అత్యవసర సంప్రదింపు నంబర్లు, పోలీసు సేవలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం అందుబాటులో ఉంటుందని వివరించారు.అలాగే సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్ లో 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పోలీసులు పాల్గొన్నారు.

# విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, జూలై 9**



విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) సేవలు అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. సిరిసిల్ల సమీపంలోని సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో ఎస్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణకు ఉపయోగించే ఆధునిక యంత్రాలు, పరికరాల ప్రదర్శనను కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్, హైడ్రాలిక్ స్పెడర్ కట్టర్, లైట్ మాస్ట్, లిఫ్టింగ్ బ్యాగ్, రోటరీ కట్టింగ్ యంత్రం, పీపీసీ రక్షణ దుస్తులు తదితర పరికరాల పనితీరును అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రిజర్వాయర్ల దృష్ట్యా వర్షాకాలంలో వరదల ముప్పు ఉంటుందని, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎఫ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎప్పుడైనా సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని ఎస్‌డీఆర్ఎఫ్ బృందానికి పిలుపునిచ్చారు. ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, విపత్తుల సమయంలో ఉపయోగించే పరికరాలతో తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, అవసరమైన యంత్రాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది వరదల సమయంలో విశేష సేవలందించిన అధికారులను అభినందించారు.

# గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసిన నూతన సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 9:**

తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు గుత్తా సుఖేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి కార్యదర్శి డా. నరసింహాచార్యులు కూడా పాల్గొన్నారు.

# మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు తొలి దశ పనులను పరిశీలించిన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, జూలై 9 .**

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు తొలి దశ పరిధిలోని ఒస్మాన్‌సాగర్, నార్సింగి ఎస్టీపీ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌డీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై వరద నియంత్రణ చర్యలు, మురుగునీటి శుద్ధి వ్యవస్థల అనుసంధానం, భూసేకరణ మరియు అభివృద్ధి, నది తీర మౌలిక సదుపాయాల ప్రణాళికపై సమీక్షించారు. ప్రాజెక్టు దీర్ఘకాలిక స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ, నగరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా శాస్త్రీయ ప్రణాళికతో సమన్వయంగా పనులు చేపట్టాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. హైదరాబాద్ ప్రజలకు శాశ్వత ప్రయోజనాలు అందేలా నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. మూసీ, ఈసా నదుల సంగమం వరకు గాంధీ సరోవర్ పరిధిలో మెరుగైన అనుసంధానం, సుస్థిర పట్టణాభివృద్ధి కోసం హెచ్ఎండీఏ, ఎంఆర్‌డీసీఎల్ కలిసి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి సూచనలను అమలు చేస్తూ మూసీ రివర్‌ఫ్రంట్ తొలి దశ పనులను మరింత వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతి.

**హైదరాబాద్, జూలై 9: .**

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. భూసేకరణ వ్యయం మినహా ఈ నిధులతో జోన్–1ఏ, జోన్–1బీ ప్రాధాన్య కారిడార్లలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టులో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. కలిపి మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) నుంచి రూ.4,500 కోట్ల రుణం సమకూరనుండగా, మిగిలిన రూ.2,845.12 కోట్లను హెచ్ఎండీఏ (HMDA), టీజీఐఐసీ (TGIIC) రుణాల ద్వారా సమకూర్చనున్నారు. పనులను ఈపీసీ (EPC) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ (PMC) నియామకానికి కూడా ఆమోదం తెలిపింది. ఏడీబీ మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు కొనుగోలు (ప్రొక్యూర్‌మెంట్) ప్రక్రియ చేపట్టాలని, తదుపరి చర్యలను మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (MRDCL) వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ప్రకృతి ఆధారిత విధానాలతో నదుల పునరుజ్జీవనానికి కేంద్రం కొత్త చర్యలు

**న్యూఢిల్లీ, జూలై 9 .**

నదుల పునరుజ్జీవనానికి ప్రకృతి ఆధారిత విధానాలకు ప్రాధాన్యం ఇస్తూ జాతీయ గంగా పరిరక్షణ మిషన్ రెండు నమూనా ప్రాజెక్టులను ప్రారంభించింది. యమునా నదిలో కలిసే శాస్త్రి పార్కు మురుగు కాలువ, కైలాస్ నగర్ మురుగు కాలువల వద్ద రోజుకు సుమారు పది లక్షల లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల్లో రాళ్ల వడపోత వ్యవస్థలు, జల మొక్కలు, కాలుష్యాన్ని సహజంగా తొలగించే మొక్కలను ఉపయోగించి నీటిని శుద్ధి చేస్తారు. దీనివల్ల నీటి నాణ్యత మెరుగుపడటంతో పాటు జీవ వైవిధ్యం పెంపొందుతుందని అధికారులు తెలిపారు. ప్రకృతి ఆధారిత విధానాల అమలుపై అధికారులకు అవగాహన కల్పించేందుకు గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఆరు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వంద మందికి పైగా అధికారులు, ఇంజినీర్లకు శిక్షణ ఇచ్చారు. అదనంగా గంగానదికి ఉపనదిగా ఉన్న కాళీ నది పునరుజ్జీవనానికి ఖతౌలి ప్రాంతంలో కూడా సహజ చిత్తడి నేలల ఆధారంగా మరో ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. సహజ పద్ధతుల ద్వారా నదుల కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిరమైన నీటి నిర్వహణను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని జాతీయ గంగా పరిరక్షణ మిషన్ తెలిపింది.

# నూతన ప్రధాన కార్యదర్శికి స్పీకర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూలై 9**

: తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం ఆయన అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంజయ్ జాజును శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య కూడా పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్‌తో ప్రధాని మోదీ భేటీ

**మెల్‌బోర్న్, జూలై 9 :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌తో మెల్‌బోర్న్‌లో సమావేశమయ్యారు. ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణల రంగాల్లో సహకారం విస్తరించడం ద్వారా రెండు దేశాల ప్రజలకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. క్రీడా రంగంలో పెరుగుతున్న సంబంధాలను స్వాగతించిన ఇరు నాయకులు, భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న 2030 కామన్వెల్త్ క్రీడలు, ఆస్ట్రేలియా నిర్వహించనున్న 2032 ఒలింపిక్ క్రీడలు దృష్ట్యా మరింత సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు. భారత్–ఆస్ట్రేలియా ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు ద్వైపాక్షిక బంధానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్–ఆస్ట్రేలియా సంబంధాల అభివృద్ధికి గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్ అందిస్తున్న నిరంతర సహకారాన్ని ఆయన అభినందించారు.

## సిల్క్‌నగర్‌లో నూతన హాకా రైతు సేవా కేంద్రం ప్రారంభం

### రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటాయి: ప్రొప్రైటర్ దొంతుల రాజు



**ఆలేరు, జూలై 9 :**

ఆలేరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని సిల్క్‌నగర్‌లో నూతన హాకా రైతు సేవా కేంద్రంను ఆలేరు మున్సిపాలిటీ బహదూర్‌పేట బిల్ కలెక్టర్ దొంతుల ఎల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉండడం అభినందనీయమని అన్నారు. రైతు సేవా కేంద్రం ప్రొప్రైటర్ దొంతుల రాజు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పత్తి పంటకు అవసరమైన పురుగుమందులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు, సేవలను కూడా అందిస్తామని పేర్కొన్నారు.

## వైఎస్సార్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**హైదరాబాద్, జూలై 9**

: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు, చూపిన సంక్షేమ బాట ఎప్పటికీ చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

## మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, ఎస్పీ



**ములుగు, జూలై 9 .**

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జన్మదినం సందర్భంగా గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జీ, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య

**నారాయణపేట, జులై,09**



నారాయణపేట జిల్లా కేంద్రంలోని లిటిల్ స్టార్ హై స్కూల్ మరియు రవితేజ హై స్కూల్లో ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు మరియు బాధ్యతాయుతమైన రహదారి వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సె కృష్ణ చైతన్య మాట్లాడుతూ... విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.విద్యార్థులు రహదారిపై నడిచేటప్పుడు ఎడమవైపున నడవాలని, రోడ్డు దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్‌ను వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు ఎంతో కీలకమని, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని వివరించారు.18 సంవత్సరాలు నిండని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ మోటార్ వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రులు కూడా చట్టరీత్యా నేరమని తెలిపారు. అధిక వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర సేవల వాహనాలకు వెంటనే దారి ఇవ్వాలని, రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్ నియమాలు కేవలం జరిమానాల కోసం కాకుండా, ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడేందుకే రూపొందించబడ్డాయని చెప్పారు.విద్యార్థులు ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితులకు కూడా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక రోడ్ సేఫ్టీ అంబాసిడర్ గా మారి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరుడిగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం: మంత్రులు

**సంగారెడ్డి, జూలై 9 :**



ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డిలో నూతన ఈఎస్ఐ డిస్పెన్సరీని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల కుటుంబాలు ఈఎస్ఐ సేవలపై ఆధారపడుతున్నాయని, ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆరు నెలల్లో అన్ని ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 20 పడకల డయాలసిస్ యూనిట్, వచ్చే ఏడాది కార్డియాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. శంషాబాద్, రామగుండం, మహబూబ్‌నగర్‌లో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రుల మంజూరుకు కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిని రూ.200 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 104 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డా. ఎన్. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ

**రాయపోల్, జూలై 9:**



రాయపోల్ మండలంలోని ఆరేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ధనాక్రాప్ సైన్సెస్ సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్సై మానస, ఆరేపల్లి గ్రామ సర్పంచ్ దివ్యకృష్ణ, ధనాక్రాప్ సైన్సెస్ ఎండీ తేజస్ పబ్బతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను పాఠశాలకు పంపించడమే కాకుండా ప్రతిరోజూ కొంత సమయం వారితో గడుపుతూ మంచి అలవాట్లు, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించాలని తల్లిదండ్రులకు సూచించారు. మొబైల్ ఫోన్లకు పిల్లలు అతిగా అలవాటు పడకుండా చూసుకోవడంతో పాటు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనాక్రాప్ సైన్సెస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఎం తేజ, ఏఎస్ఎం చక్రపాణి, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేష్, ఉపసర్పంచ్ విరేష్, వార్డు సభ్యులు కనకయ్య, నర్సింలు, మంజుల, కళ్యాణి, కొమురయ్య, మమత, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన క్రిమినల్ చట్టాల అమలుపై జిల్లా సీఐ, ఎస్సైలకు ఐక్యూ (IQ) టెస్ట్ నిర్వహించిన ఎస్పీ డాక్టర్ వినీత్ IPS






**నారాయణపేట, జులై 09**

నారాయణపేట జిల్లా పోలీసు శాఖలో కొత్త క్రిమినల్ చట్టాలు భారతీయ న్యాయ సంహిత (BNS), భారతీయ నాగరిక సురక్ష సంహిత (BNSS), భారతీయ సాక్ష్య అధినియమం (BSA) అమలులో భాగంగా జిల్లా పోలీసు అధికారుల నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS ఆదేశాల మేరకు డీఎస్పీ లు మహేష్ లింగయ్య ల ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని సీఐలు,ఎస్సైలకు "New Criminal Laws Field Application" అంశంపై ప్రత్యేక ఐక్యూ టెస్ట్ నిర్వహించారు.ఈ పరీక్షలో నూతన క్రిమినల్ చట్టాలకు సంబంధించిన ఫీల్డ్ ఆపరేషన్స్, దైనందిన పోలీసు విధులు, కేసుల దర్యాప్తు, చట్టాల

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ

**జయశంకర్ భూపాలప ల్లి, జూలై 9**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జె. జీవన్ కుమార్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెండింగ్ లో ఉన్న వివిధ కోర్టు కేసుల పురోగతిపై చర్చించారు. కేసుల త్వరిత పరిష్కారానికి, న్యాయ ప్రక్రియ మరింత వేగవంతం కావడానికి జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.





## రాక్‌బాల్‌లో స్వర్ణం సాధించిన గోపాల్ యాదవ్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అభినందనలు

**హైదరాబాద్, జూలై 9 .**

నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు తరఫున స్వర్ణ పతకం సాధించిన ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థి గోపాల్ యాదవ్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే, ఎంఎల్ఆర్ఐటీ ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖరరెడ్డి అభినందించారు. గోపాల్ యాదవ్ క్రీడా ప్రతిభను గుర్తించి ఎంఎల్ఆర్ఐటీ స్పోర్ట్స్ కోటా కింద ఉచిత ఎంబీఏ విద్య అందించామని తెలిపారు. ప్రతి ఏడాది సుమారు రూ.1.5 కోట్ల విలువైన స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌లతో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో గోపాల్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



చురకలు



# నీటి ఎద్దడిని తట్టుకునే, వర్షా ధార పంటలను సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలి

**అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**

**వికారాబాద్, జులై,09**




నీటి ఎద్దడిని తట్టుకునే, వర్షాధార పంటలను సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. గురువారం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున పంటల సాగుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు లు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు ఇచ్చారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.... నీటి ఆధారిత పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే విధంగా అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు.ఎల్ నినో ప్రభావం వల్ల అతి తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నీటి ఆధారిత పంటలు వేసినట్లయితే రైతులు నష్టపోతారు అనే విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఆయకట్టు కింద ఉన్న పొలాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు అంటే కందులు, మొక్కలు, చిరుధాన్యాల పంటలను వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుండి జిల్లా వ్యవసాయ అధికారి కవిత, ఇరిగేషన్ డిఈ మంజుల సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

- **పి.డి.ఎస్.యూ., పి.వై.ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపు**

**ఆలేరు, జూలై 9 :**



రాష్ట్రంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని పి.డి.ఎస్.యూ., పి.వై.ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం భర్తీ చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాల్లో మౌలిక వసతుల కొరత, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని, జీవో నెం. 7, 8, 9లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాసంస్థల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకోవడం, ప్రతి విద్యాసంస్థలో ఐసీసీ కమిటీల ఏర్పాటు, కార్పొరేట్ విద్యా వ్యవస్థ నియంత్రణతో పాటు విద్యపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 10న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కొడంగల్ బూత్ నంబర్,243,246 గుండ్ల కుంట లో ఓటరు జాబితా ఫారాలు అందజేత

**కొడంగల్ మున్సిపల్, జులై,09**





కొడంగల్ మున్సిపల్ కేంద్రం బూత్ నంబర్ 243 వడ్డెర గల్లి,246 గుండ్లకుంటలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్– సార్)లో భాగంగా బిఎల్ఓ యాదమ్మ, శారద ఆధ్వర్యంలో జరుగుతున్న సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏరన్ పల్లి శ్రీనివాస్,బిఆర్ఎస్ పార్టీ కంటెస్టెడ్ కౌన్సిలర్ అభ్యర్థి గొల్ల బలరాజ్ చేతుల మీదుగా అంజి,గడ్డ మీది నాగమ్మ కు ఓటర్ జాబితా పత్రాన్ని ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,,, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా బిఎల్ఓ లకు సహకరించి పత్రాలను పూరించడంలో పార్టీలకు అతీతంగా సహకరించి,ఎటువంటి అయోమయాలకు గురికాకుండా ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని,ఓట్లు తొలిగిపోకుండా ప్రతి పౌరుడు సహకరించాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ శేఖర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాసాని వెంకటయ్య, అశోక్,అంజిలప్ప,భీమేష్,నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల కింద 21 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

**హైదరాబాద్, జూలై 9**

హైదరాబాద్ జిల్లాలో కారుణ్య నియామకాల కింద వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 21 జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా గురువారం కలెక్టరేట్‌లో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

రెవెన్యూ శాఖలో 17 మంది, గాంధీ ఆసుపత్రిలో ఒకరు, ఏసీబీ కార్యాలయంలో ఒకరు, ప్రభుత్వ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ఒకరు, ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఒకరు చొప్పున మొత్తం 21 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగాన్ని పవిత్రమైన బాధ్యతగా భావించి నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని నూతన ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకట్రామిరెడ్డి, సంబంధిత శాఖల సిబ్బంది, నియామకం పొందిన అభ్యర్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# ఏబీవీపీ ఆధ్వర్యంలో 78వ జాతీయ విద్యార్థి దినోత్సవం

**దద్దరిల్లిన ఏబీవీపీ ఆలేరు శాఖ ఘనంగా ర్యాలీ, జెండా ఆవిష్కరణ**

**ఆలేరు, జూలై 9 :**




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం ఆలేరు పట్టణంలో ఘనంగా ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఎస్ దక్షిణ మధ్య కేంద్ర సంయోజక సవ్వాడి క్రిష్ మాట్లాడుతూ ఏబీవీపీ కేవలం విద్యార్థి సమస్యల పరిష్కారానికే పరిమితమైన సంస్థ కాదని, జాతీయ పునర్నిర్మాణ లక్ష్యంతో పనిచేస్తున్న అతిపెద్ద విద్యార్థి ఉద్యమ సంస్థ అని పేర్కొన్నారు. 1949 జూలై 9న ఢిల్లీ విశ్వవిద్యాలయంలో కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ, నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను సంఘటితం చేసుకుంటూ విద్యా, సామాజిక, జాతీయ అంశాలపై కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఏబీవీపీ విశిష్ట సేవలు అందిస్తోందని ఆయన అన్నారు. విద్యార్థులు సమాజ మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి దీపక్ చారి, ఓర్సు శ్రావణ్, పృద్వి, అక్షయ్, పూజిత,

# భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ ఘనంగా ముగింపు – వరంగల్‌కు 28

**వరంగల్, జూలై 9 .**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామునూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహించిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ గురువారం ఘనంగా ముగిసింది. వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసు అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. పోటీల్లో వరంగల్ కమిషనరేట్ 13 స్వర్ణ పతకాలతో కలిపి మొత్తం 28 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం 12, మహబూబాబాద్ 13, ఖమ్మం 9 పతకాలు సాధించాయి. విజేతలు త్వరలో మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొననున్నారు.

## భూముల రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి:

**రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్**

**జగిత్యాల, జూలై 9**

ఆధునిక సాంకేతికతతో భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్, జీఐఎస్ సాంకేతికతతో సర్వే నిర్వహించి గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ భూ భారతి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల వల్ల దరఖాస్తుల పరిష్కారంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

## ఉద్యాన శాఖ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:

**జిల్లా ఉద్యాన శాఖ అధికారి**

**పెద్దపల్లి, జూలై 9: .**

పెద్దపల్లి జిల్లాలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సమీకృత ఉద్యానాభివృద్ధి మిషన్ (MIDH) కింద కూరగాయలు, పూల పంటలు, పసుపు సాగు, మల్చింగ్ షీట్లకు సబ్సిడీ అందజేస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా సూక్ష్మ నీటిపారుదల పథకం ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థల ఏర్పాటుకు కూడా సబ్సిడీ అందుబాటులో ఉందన్నారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో జిరాక్స్ ప్రతులతో సంబంధిత హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (HEO) లేదా హార్టికల్చర్ ఆఫీసర్ (HO)ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటల సాగును విస్తరించి అధిక ఆదాయం పొందాలని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఒలింపిక్ భవన్ కు నూతన రూపు



**హైదరాబాద్, జూలై 9**

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పునరుద్ధరించి ఆధునీకరించిన ★'తెలంగాణ ఒలింపిక్ భవన్'★ను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు డాక్టర్ పి.టి. ఉష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని భవన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీఎండీ సోని బాలదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. మల్లారెడ్డి, కోశాధికారి సతీష్ గౌడ్ దాసుగారి, క్రీడా అధికారులు, అసోసియేషన్ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## పనిమనిషితో భర్త సంబంధం ఆరోపణలు..

**భార్య ఫిర్యాదుతో కేసు నమోదు**

**హైదరాబాద్, జూలై 9 .**

హైదరాబాద్ ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కురుమనగర్‌లో వివాహేతర సంబంధం ఆరోపణలతో కుటుంబ వివాదం వెలుగుచూసింది. భార్య ఫిర్యాదు మేరకు, ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన మహిళతో తన భర్తకు వివాహేతర సంబంధం ఉందని ఆరోపించింది. ఈ వ్యవహారం కారణంగా గత ఐదేళ్లుగా భార్యాభర్తలు వేర్వేరుగా నివసిస్తున్నట్లు సమాచారం. తాజాగా భర్త, ఆ మహిళ కలిసి ఉన్నారనే సమాచారంతో భార్య తన బంధువులతో అక్కడికి చేరుకుని వారిని పట్టుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆగ్రహానికి గురైన కొందరు భర్తపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. అనంతరం ఇద్దరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## కారుణ్య నియామకాల కింద తొమ్మిది మందికి ఉద్యోగ నియామక పత్రాలు



**మహబూబ్‌నగర్, జూలై 9**

కారుణ్య నియామకాల కింద జిల్లాలో ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్‌లకు వివిధ ప్రభుత్వ శాఖల్లో నియామకాలు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టరేట్‌లో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, డీఆర్వో ఎ. నిర్మల, కలెక్టరేట్ ఏఓ సువర్ణ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చురకలు



## భారత్ నగర్‌లో డ్రైనేజీ సమస్యతో అవస్థలు

### మురుగునీటితో దుర్భర జీవనం.. హామీలు అమలు చేయాలని ప్రజల విజ్ఞప్తి



**ఆలేరు, జులై 09 :**

ఆలేరు మున్సిపాలిటీ 8వ వార్డు భారత్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, దోమల బెడదతో పాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం నెలకొనడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు బయటకు వచ్చి ఆడుకోలేని పరిస్థితి ఏర్పడగా, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. స్థానికురాలు గంగమ్మ భాగ్య మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య భారత్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం కూడా పలుమార్లు అధికారులను ఆదేశించి, అవసరమైతే ఎమ్మెల్యే నిధులతో మోటార్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, స్థానిక ప్రజాప్రతినిధులు పలుమార్లు పరిశీలించినా సమస్య మాత్రం అలాగే ఉందని స్థానికులు ఆరోపించారు. ఇతర వార్డుల్లో డ్రైనేజీ పనులు జరుగుతుండగా, భారత్‌నగర్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు ఎం.డి. సలీమ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాలను అధికారులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పారిశుద్ధ్య సమస్యతో దోమలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందన్నారు. భారత్‌నగర్‌లో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, తాత్కాలికంగా మోటార్లు ఏర్పాటు చేసి మురుగునీటిని తొలగించాలని, కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించాలని స్థానికులు కోరారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో మంచిర్యాల జిల్లాకు 2వ స్థానం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జూలై 09 :**

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ర్యాంకులో మంచిర్యాల జిల్లా 360 స్కోర్ తో రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి చంద్రయ్య, అధికారులతో కలిసి పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2025–26 నివేదికను విడుదల విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, 2024–25 విద్యా సంవత్సరంలో 324 స్కోర్ తో జిల్లా 3వ స్థానంలో నిలువగా, అన్ని విభాగాలలో ప్రతిభను మెరుగుపరచుకొని ఈ సంవత్సరం 360 స్కోర్ తో 2వ స్థానంలో నిలిచిందని, తెలంగాణ రాష్ట్రం తన స్థానాన్ని మెరుగుపరచుకొని జాతీయ స్థాయిలో 18వ స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలలో మూత్రశాలలు లేని పాఠశాలలను గుర్తించి మౌలిక వసతులను కల్పించడంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ద్వారా పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, తరగతి గదులకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టడం, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాల లకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహాలలో విద్యార్థులకు అదనంగా వసతి గదులు, భోజనశాల, వంటశాల, మూత్రశాలలు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ లు నిర్మించడము, ఆర్ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పరచడం, ఇంటర్మీడియట్ బ్లాక్ లను నిర్మించడం వంటి చర్యలతో పాఠశాలలో మౌలిక వసతులు బలోపేతమై ఎక్కువ స్కోరు సాధించడం జరిగినదని తెలిపారు. పాఠశాలలలో పర్యవేక్షణ మెరుగుపరిచేందుకు దాదాపు 50 మంది సభ్యులతో 8 తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి 485 పాఠశాలలను పూర్తి స్థాయిలో సమగ్రంగా తనిఖీ చేయడం జరిగిందని, డిజిటల్ విద్యను బలోపేతం చేయడం ద్వారా డిజిటల్ విద్యా విభాగంలో స్కోరు మెరుగైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం భరత్ కుమార్, జంబోజు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాల తనిఖీలకు ప్రత్యేక అధికారులు

**హైదరాబాద్, జూలై 9**

వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్ జిల్లాలోని 169 బస్తీ దవాఖానల తనిఖీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈనెల 10 నుంచి తనిఖీలు ప్రారంభమవుతాయని, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా తో కలిసి కీలక బస్తీ దవాఖానలను స్వయంగా పరిశీలిస్తామని చెప్పారు. వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, పరిశుభ్రత, ప్రయోగశాల సేవలు, మౌలిక వసతులను సమీక్షించి లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.

## ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 09 :**



జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో జూలై 24వ తేదీ వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని, బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో అధికారులకు సహకరించాలని తెలిపారు. ఓటరు ఎన్యువరేషన్ ఫారం నింపడంలో రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని, నింపిన ఫారాలను సేకరించడంలో బూత్ స్థాయి అధికారులతో కలిసి పని చేయాలని తెలిపారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బిఎల్ఓ యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని, తమ బూత్ స్థాయి ఏజెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పత్రాల సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- **ఎన్యూమరేషన్ పత్రాల సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు**
- **జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక**

**నారాయణపేట, జులై,09**



ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ ఐ ఆర్)లో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాలు నింపించే ప్రక్రియలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక హెచ్చరించారు.గురువారం జిల్లా కేంద్ర పురపాలిక పరిధిలోని కుమ్మరి వాడ పోలింగ్ కేంద్రం 142, 143 , అలాగే పళ్ళ జంగిగడ్డ పోలింగ్ కేంద్రం నెంబర్ 153 పరిధిలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాలు నింపే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. జిల్లాలోని మిగతా మున్సిపాలిటీల కంటే ఎస్. ఐ.ఆర్ ఎన్యూమరేషన్ పత్రాల భర్తీ, స్వీకరణలో స్థానిక మున్సిపాలిటీ వెనుక బడి ఉందని, ప్రతీ బీఎల్ వో రోజుకు వంద పత్రాలలో వివరాలను ఓటర్లతో నింపించి తీసుకోవాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ పత్రాలు నింపడం తెలియవారికి బీ ఎల్ వో లు సహకరించాలని ఆమె సూచించారు.అర్హులైన ఏ ఒక్క ఓటరు మిస్ కాకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా సూపర్ వైజర్లు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కొంతమంది సూపర్ వైజర్ల పనితీరు సంతృప్తికరంగా లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని అన్ని వార్డులలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమరేందర్ కృష్ణ, మున్సిపాలిటీ మేనేజర్ అజీమ్, వార్డు ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 09 :**



గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచ్ లు స్థానిక అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి పరిధిలోని అమ్మ గార్డెన్స్ లో గ్రామ సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో సర్పంచ్ లు, వార్డు సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీలకు లభించే 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, విబి జి రామ్ జీ పథకం తదితర వనరులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జంతు పునరుత్పత్తి నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పశువైద్య శాఖ ద్వారా శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని, గ్రామ పంచాయతీలు కుక్కలను పట్టుకోవడం, సంరక్షణ వంటి అంశాలపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. మురుగునీటి వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ హాళ్లు, త్రాగునీటి సరఫరా, సౌర విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులకు ప్రభుత్వ పథకాలలో ప్రత్యేక నిధులు అందుబాటులో ఉన్నాయని, ఆయా పథకాల మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ, విబి జి రామ్ జీ పథకాల క్రింద చేపట్టిన పనులకు చెల్లింపులు నిర్ణీత గడువులో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, సకాలంలో సమర్పించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులను ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించాలని, నిధుల దుర్వినియోగం, మళ్లింపు జరిగినట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, మహిళా సంఘాల భవనాలు, ఇతర ప్రాధాన్యత కలిగిన మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన భూమి, పరిపాలనా అనుమతులు జిల్లా యంత్రాంగం నుంచి అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు కూరగాయల సాగు కోసం పందిళ్ల ఏర్పాటు, బీటీ రహదారులు, మ్యాజిక్ డ్రైన్లు, సౌర విద్యుత్ ఆధారిత వీధి దీపాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలలో చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని, అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్ లు చొరవ తీసుకుని గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అరుణోదయ నాగన్నకు ఘన నివాళి

- **సిఎంఆర్ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 09 :**



జిల్లాలో సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించి సిఎంఆర్ లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, రైస్ మిల్లర్లు లక్ష్య సాధన దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు చేయవలసిన చెల్లింపులను త్వరగా పూర్తి చేయాలని, డీలర్లకు కేటాయించిన ప్రకారంగా ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని తెలిపారు. డిఫాల్టర్లు త్వరగా బకాయిలు 70 శాతం వరకు చెల్లించాలని, ఆగస్టు 31వ తేదీ లోగా సిఎంఆర్ డెలివరీ పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## 86 కేసుల్లో స్వాధీనం చేసిన 862 కిలోల గంజాయి దగ్ధం

**హనుమకొండ, జూలై 9**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 86 కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు 862 కిలోల గంజాయిని గురువారం హనుమకొండ జిల్లా అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్‌లో ఇన్సినరేషన్ విధానంలో దగ్ధం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు రూ.4.31 కోట్ల విలువైన గంజాయిని నిబంధనల ప్రకారం నిర్వీర్యం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఛైర్మన్, డీసీపీ (ఈస్ట్ జోన్) అంకిత్ కుమార్ సంక్వార్, ఐపీఎస్, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సీసీఆర్బీ పి. డేవిడ్ రాజు, ఇన్‌స్పెక్టర్లు సంజీవరావు, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.



# కోట నటనకు సాటెవ్వరు?!

"వెండితెరపై నవరసాల సామ్రాజ్యం..

## విలక్షణ నటనతో మూడు దశాబ్దాల పాటు వెండితెరను ఏలిన నటనా శిరోమణి

## పద్మశ్రీ, తొమ్మిది నంది పురస్కారాలతో పాటు రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత

## నేడు కోట శ్రీనివాసరావు జయంతి

తెలుగు సినిమా చరిత్రలో తమ అభినయ పటిమతో, ప్రత్యేక శైలితో, పాత్రలకు ఊపిరి పోసే నైపుణ్యంతో శాశ్వత గుర్తింపు పొందిన నటుల్లో కోట శ్రీనివాసరావు అగ్రగణ్యులు. మూడు దశాబ్దాల పాటు తెలుగు చిత్రసీమలో విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్, హాస్య నటుడు, నాయక పాత్రలలోనూ తనదైన ముద్ర వేసిన అద్భుత నటనా శిరోమణి ఆయన. జూలై 10న ఆయన జయంతి సందర్భంగా తెలుగు సినీ లోకం ఆ మహానటుడిని ఘనంగా స్మరించుకుంటోంది. 750కి పైగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన కోట, తాపత్రయంగా కాక తపస్సుగా నటనను అర్థం చేసుకుని, ఆరాధించి, ప్రతి పాత్రలోనూ కొత్త ప్రయోగాలు చేసి, నటనకు ఒక కోటను కట్టారు.

### రంగస్థలం నుండి వెండితెర వరకు..

కోట శ్రీనివాసరావు 1942 జూలై 10న కృష్ణా జిల్లాలోని కంకిపాడు గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల పట్ల ఆసక్తితో రంగస్థలంపై నటనను అభ్యసించారు. ఉద్యోగంగా స్టేట్ బ్యాంకులో పని చేసిన ఆయన, నటన పట్ల ఉన్న వ్యామోహం వదలకుండా, రాత్రిపూట నాటకాలకు, స్వతంత్ర ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రంగస్థల అనుభవమే ఆయనను వెండితెరపై అజరామర నటుడిగా మలిచింది. తెలుగు సినిమా రంగంలోకి ఆయన ప్రవేశం 1978లో 'ప్రాణం ఖరీదు' చిత్రంతో జరిగింది. మొదట చిన్న చిన్న పాత్రలతో ప్రారంభమైన ఆయన ప్రస్థానం, 1985లో 'ప్రతిఘటన' చిత్రంలోని నికృష్టమైన విలన్ పాత్రతో పెద్ద మలుపు తిరిగింది. అప్పటి నుంచి ఆయన నటించిన ప్రతి చిత్రంలో ప్రత్యేకత, ప్రజ్ఞ స్పష్టంగా కనిపించాయి.

### నవరసాల అభినయం - డైలాగ్ డెలివరీలో ప్రత్యేకం

కోట నటనలో నాటకీయతకు, సహజత్వానికి మధ్య సుమధుర సమతుల్యత ఉంటుంది. ఆయన సంభాషణ పఠనం... స్పష్టతతో, భావ వ్యక్తీకరణలో, పటుత్వంతో శ్రోతలను కట్టిపడేస్తుంది. హాస్యానికి కొత్త ఉపమానం ఇచ్చిన ఆయన, బాబు మోహన్‌తో చేసిన కాంబినేషన్ పలు సినిమాల్లో నవరసాలకు ఊతమిచ్చింది. కామెడీ, క్రూరత, కుయుక్తి, సమవేదన.. ఇలా అన్ని భావాలను ఆయన అత్యద్భుతంగా పోషించగలిగారు. 'ఆహా నా పెళ్లంట!', 'ఖైదీ నంబర్ 786', 'శివ', 'యమలీల', 'మనీ', 'గాయం', 'బొమ్మరిల్లు', 'అతడు', 'లీడర్', 'అత్తారింటికి దారేది', 'రక్త చరిత్ర' వంటి ఎన్నో చిత్రాలలో ఆయన నటన ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఒక్కో పాత్ర ఒక్కో కోణాన్ని, ఆ పాత్రను ఆయన మాత్రమే చేయగల నైపుణ్యాన్ని సూచించాయి.

### రాజకీయ ప్రస్థానం మరియు పురస్కారాలు

కోట రాజకీయ ప్రస్థానమూ ప్రశంసనీయమే. 1999లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ విప్‌గానూ పనిచేశారు. సినిమా ద్వారా వచ్చిన లోకజ్ఞానం ఆయనను ప్రజా జీవితంలోనూ సేవాకర్తగా నిలిపింది. అయితే ఆ తర్వాత ఆయన రాజకీయాల నుండి నిష్క్రమించారు. సినీ రంగంలో చేసిన సేవలకు గాను ఆయనకు ఎన్నో గౌరవాలు, పురస్కారాలు లభించాయి. 2015లో భారత ప్రభుత్వం ఆయనను 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. తొమ్మిది నంది అవార్డులతో పాటు, సైమా (గా××హీూ) అవార్డు, ఇతర రాష్ట్రస్థాయి గౌరవాలు కూడా పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఆయనకు అత్యున్నత 'రఘుపతి వెంకయ్య అవార్డు' ప్రకటించి సత్కరించింది.

### తీరని లోటు

గత ఏడాది 2025 జూలై 13న కోట శ్రీనివాసరావు అనారోగ్య కారణాలతో తుదిశ్వాస విడిచారు. 83 ఏళ్ల వయసులో తెలుగు సినీ ప్రేక్షకులు ఓ విలక్షణ నటుడిని కోల్పోయారు. ఆయన మరణం తెలుగు చిత్రసీమకు తీరని లోటును మిగిల్చింది. కోట చేసిన ప్రతి పాత్ర, ప్రతి సంభాషణ, ప్రతి హావభావం.. ఇవన్నీ నటనకే నిధులు. ఆయన పాత్రల జ్ఞాపకాలు తెలుగువాళ్ల భావజాలంలో చిరకాలం నిలిచి ఉంటాయి. అభినయ పాఠశాలలకే ఆదర్శంగా నిలిచే నటనామూర్తి కోట శ్రీనివాసరావు జీవితం, వారసత్వం భారతీయ నటనకే ఒక విలువైన అధ్యాయం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి అమరేశ్వరి

**నేడు జస్టిస్ కే.అమరేశ్వరి జయంతి**

### ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి మహిళా జడ్జిగా చరిత్ర సృష్టించిన వైనం

సమాజంలో స్త్రీలకు సరైన గౌరవం, మర్యాద లభించని రోజుల్లో కొందరు మహిళలు పట్టుదలతో ముందుకు వచ్చి, పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని, స్వయం కృషితో వివిధ రంగాల్లో తమ సత్తా చాటారు. పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని ఆరోజుల్లోనే నిరూపించి సాటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. అలాంటి వారిలో జస్టిస్ కొనమనేని అమరేశ్వరి అగ్రగణ్యులు. ఒక సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆమె.. దేశంలోనే హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా పనిచేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడంలో పేదరికం, వివాహం వంటివి ఏమాత్రం అడ్డురావని నిరూపించి, మహిళల్లో చైతన్యాన్ని నింపారు. జస్టిస్ కె. అమరేశ్వరి గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామములో ఒక సాధారణ వ్యవసాయ కుటుంబములో 1928, జులై 10వ తేదీన జన్మించారు. కేవలం 14వ ఏటనే ఆమెకు వివాహం జరిగినా.. భర్త ప్రోత్సాహముతో చదువును కొనసాగించారు. ఆమె 1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పాలిటిక్స్ అండ్ హిస్టరీలో ఎంఏ డిగ్రీని పొందారు. ఆ తర్వాత అదే విశ్వవిద్యాలయం నుండి బిఎల్ (లా) డిగ్రీని కూడా పూర్తి చేశారు.

### న్యాయవాదిగా ప్రస్థానం..

ప్రముఖ న్యాయవాది డి.మునికన్నయ్య ఛాంబర్స్‌లో



ఆమె అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసి, 1952 సంవత్సరంలో మద్రాస్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత గుంటూరుకు, అనంతరం హైదరాబాద్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మారినప్పటికీ ఆమె తన వృత్తిని విజయవంతంగా కొనసాగించారు. 1960-61 మధ్య కాలంలో బార్ కౌన్సిల్ సభ్యులుగా సేవలు అందించారు. అక్టోబర్, 1974లో అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. భారత మహిళా న్యాయవాదుల సంఘమునకు ఉపాధ్యక్షులుగా, 1975-76 మధ్యకాలంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా వివిధ కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

### చరిత్ర సృష్టించిన క్షణం..

1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు కాగా.. ఆ ఉమ్మడి హైకోర్టులోనే తొలి మహిళా న్యాయమూర్తిగా జస్టిస్ అమరేశ్వరి 29-4-1978న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులై దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించారు. సుమారు పదమూడున్నర సంవత్సరాల పాటు హైకోర్టు న్యాయమూర్తిగా ఎన్నో కీలక తీర్పులను ఇచ్చారు. 1990లో పదవీ విరమణ చేసిన అనంతరం, ఆమె సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా దాదాపు 13 సంవత్సరాల పాటు ప్రాక్టీస్ కొనసాగించారు.

### సామాజిక స్పృహ - ప్రైవేటు రిజర్వేషన్లపై గళం..

న్యాయ వ్యవస్థలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సాధించిన జస్టిస్ అమరేశ్వరి.. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను గట్టిగా సమర్థించారు. 'ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు - చట్టపరమైన పరిణామాలు' అన్న అంశంపై నిర్వహించిన ఒక సెమినార్లో ఆమె తన అభిప్రాయాన్ని ముక్కుసూటిగా వెల్లడించారు. ప్రభుత్వం నుంచి రాయితీలు, భూములు అందుకుంటున్న ప్రైవేటు సంస్థలు సిబ్బంది నియామకంలో కచ్చితంగా రిజర్వేషన్లను అమలు చేయాలని ఆమె వాదించారు. మహిళలకు మార్గదర్శకురాలై, దేశ న్యాయ వ్యవస్థలో చెరగని ముద్ర వేసిన జస్టిస్ అమరేశ్వరి 2009, జులై 25న కొత్త ఢిల్లీలో మరణించారు. ఆమె జయంతి సందర్భంగా న్యాయరంగం నేడు ఆమె సేవలను ఘనంగా స్మరించుకుంటోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# చేపల రైతు చేతుల్లో దేశ ఆహార భద్రత

**నేడు జాతీయ చేపల రైతుల దినోత్సవం**

### 'నీలి విప్లవ' స్ఫూర్తితో ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరిన భారత్

### 2.8 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న మత్స్య రంగం

### ఆక్వాకల్చర్‌లో ఏపీ నంబర్ వన్

ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాకుండా, దేశ మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది.



### చారిత్రక నేపథ్యం..

ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపుకోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి మరియు డాక్టర్ కె.హెచ్. అలీ కున్హి ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రేరిత ప్రజనన సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడి, 'నీలి విప్లవం'కు నాంది పలికింది.

### ప్రపంచ స్థాయిలో దేశీయ మత్స్య రంగం..

నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131 లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచే లభించాయి. అంతేకాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8 శాతంగా ఉంది. ఈ రంగం దాదాపు 2.8 కోట్ల మంది మత్స్యకారులకు, గ్రామీణ యువతకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని మొత్తం చేపల ఉత్పత్తిలో దాదాపు 35 శాతం సింహభాగాన్ని కలిగి ఉంది. సరైన విధానాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్య రంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి.

### ప్రభుత్వాల ప్రోత్సాహం - పీఎంఎంఎస్‌వై

కేంద్ర ప్రభుత్వం 'నీలి విప్లవం'ను మరింత బలోపేతం చేయడానికి 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' వంటి ప్రతిష్టాత్మక పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్-హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, కోల్డ్ స్టోరేజీలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో పీఎంఎంఎస్‌వై కింద దాదాపు 2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అలాగే నూతన ఆవిష్కరణలతో కూడిన బయోఫ్లాక్ , ఆర్ఏఎస్, ఇంటెసివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటి వనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి.



### సవాళ్లు - పరిష్కారాలు..

మత్స్య రంగం సాధిస్తున్న ప్రగతి ఒకవైపైతే, ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. పెరుగుతున్న నీటి కాలుష్యం, సకాలంలో నాణ్యమైన మేత, మార్కెట్ మద్దతు లేకపోవడం, గిట్టుబాటు ధర దక్కకపోవడం, కోల్డ్ చైన్ రవాణా లోపాలు, గ్రామీణ స్థాయిలోకి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. జలవనరుల క్రమబద్ధీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో ఉత్తమ అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు నిర్వహించడం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్ని పంచుకుంటూ వ్యవస్థను మెరుగుపరిచే మార్గాలు అన్వేషిస్తున్నారు.

**ఈ నేపథ్యంలో, జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం ఒక రోజు స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగా మారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలాదారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకితభావానికి సముచిత గౌరవం తెలుపడమే ఈ దినోత్సవం యొక్క అసలైన ఉద్దేశం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం ధర స్వల్ప పెరుగుదల

**హైదరాబాద్, జూలై 9 :** గత రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు గురువారం స్వల్పంగా పెరిగాయి. దేశీయ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.110 పెరిగి రూ.1,43,240కు చేరుకుంది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర కూడా రూ.110 పెరిగి రూ.1,31,300గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,07,430గా ఉంది. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,240, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,300, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,430గా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. 24 క్యారెట్ల బంగారం రూ.1,43,240, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,300, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,430గా ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో స్వల్ప తేడాలు కనిపించాయి. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,43,390, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,450, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,580గా నమోదైంది. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,290, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,350, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,480గా ఉంది. చెన్నై, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో మాత్రం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,43,240, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,300, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,430గా నమోదైంది. మార్కెట్‌లో అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ మారకం విలువ, పెట్టుబడిదారుల కొనుగోళ్లు వంటి అంశాల ప్రభావంతో బంగారం ధరల్లో రోజువారీగా హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయని బులియన్ వ్యాపారులు పేర్కొంటున్నారు.

# ఇక పుట్టిన రోజులు మర్చిపోవడం కష్టం!

## వాట్సాప్‌లో కొత్త ఫీచర్..

**హైదరాబాద్, జులై 9 :** ప్రపంచంలో అత్యధిక మంది ఉపయోగించే మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన వినియోగదారుల కోసం మరో ఉపయోగకరమైన ఫీచర్‌ను తీసుకురాబోతోంది. కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఆప్తుల పుట్టినరోజులను గుర్తు చేసేందుకు 'బర్త్‌డే రిమైండర్' ఫీచర్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే, పుట్టినరోజు తేదీలను ప్రత్యేకంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ యాప్‌లోనే నోటిఫికేషన్లు కనిపించనున్నాయి. ఈ కొత్త ఫీచర్‌లో భాగంగా వాట్సాప్‌లో ప్రత్యేకంగా 'బర్త్‌డేస్' అనే విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో వినియోగదారుల కాంటాక్ట్స్‌లో ఉన్న వారి రాబోయే పుట్టినరోజుల జాబితా కనిపిస్తుంది. పుట్టినరోజు రోజున యాప్ నేరుగా నోటిఫికేషన్ పంపించి శుభాకాంక్షలు తెలియజేసే అవకాశాన్ని కల్పించనుంది. దీంతో ముఖ్యమైన వ్యక్తుల పుట్టినరోజులు మర్చిపోయే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం ఈ ఫీచర్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ బీటా వెర్షన్లలో పరీక్షల దశలో ఉంది. టెస్టింగ్ విజయవంతంగా పూర్తయిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా సాధారణ వినియోగదారులందరికీ దశలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు. అధికారిక విడుదల తేదీపై మాత్రం ఇప్పటివరకు వాట్సాప్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రైవసీకి కూడా ఈ ఫీచర్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. అవతలి వ్యక్తి తన పుట్టిన తేదీని వాట్సాప్‌లో నమోదు చేసినప్పుడే ఆ సమాచారం కాంటాక్ట్స్‌కు కనిపించే అవకాశం ఉంటుంది. అలాగే భవిష్యత్తులో ప్రైవసీ సెట్టింగ్స్ ద్వారా తమ పుట్టినరోజు వివరాలను ఎవరికి చూపించాలో వినియోగదారులే నిర్ణయించుకునే అవకాశం కూడా కల్పించనున్నారు. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో పుట్టినరోజు రిమైండర్ సదుపాయం విస్తృతంగా ఉపయోగంలో ఉండగా, ఇప్పుడు అదే సౌకర్యాన్ని వాట్సాప్‌లో కూడా అందుబాటులోకి తీసుకురావడం వినియోగదారులకు మరింత ఉపయోగకరంగా మారనుంది. ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం మరింత సులభంగా మారుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# ఉద్రిక్తతల మధ్య స్థిరంగా ఇంధన ధరలు

**హైదరాబాద్, జులై 9 :** మధ్య ఆసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో అమల్లో ఉన్న శాంతి ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు ఆ దేశ ఇంధన రంగంపై కఠిన ఆంక్షలను పునరుద్ధరించారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేయకూడదని, ఆ దేశం కూడా ఇతర దేశాలకు చమురు విక్రయించకూడదని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగే అవకాశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు నియంత్రణలోనే ఉన్నాయి. భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ప్రకటిస్తాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా వ్యయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, డీలర్ల కమిషన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ధరలను నిర్ణయిస్తారు. గ్లోబల్ మార్కెట్‌లో చోటుచేసుకునే మార్పుల ప్రభావం కొంత ఆలస్యంగా దేశీయ ఇంధన ధరలపై కనిపిస్తుంది. జులై 9 నాటికి తెలంగాణలో ఇంధన ధరలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో కూడా ధరల్లో పెద్దగా మార్పులు లేవు. స్థానిక రవాణా వ్యయం, పన్నుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో స్వల్ప తేడాలు మాత్రమే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంధన ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51గా, డీజిల్ ధర రూ.105.20గా నమోదైంది. విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం తదితర ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో ఎలాంటి మార్పులు కనిపించలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన ధరలు స్థిరంగా ఉండటంతో వాహనదారులకు తాత్కాలికంగా ఊరట లభించింది. అయితే అంతర్జాతీయంగా ఇరాన్‌కు సంబంధించిన తాజా పరిణామాలు మరింత తీవ్రరూపం దాల్చితే, రాబోయే రోజుల్లో ముడి చమురు ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దాని ప్రభావం దేశీయ పెట్రోల్, డీజిల్ ధరలపై కూడా కనిపించే అవకాశముందని వారు సూచిస్తున్నారు. ప్రస్తుతం మాత్రం దేశవ్యాప్తంగా ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు లేకపోవడం వినియోగదారులకు కొంత ఉపశమనంగా మారింది.



# మైక్రోసాఫ్ట్ భారీ ఉద్యోగాల కోత..

**వాషింగ్టన్, జులై 9 :** ప్రపంచ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారీ స్థాయిలో ఉద్యోగాల కోతను ప్రకటించింది. సంస్థలోని ప్రపంచవ్యాప్త ఉద్యోగుల్లో సుమారు 2.1 శాతం మందిపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుండగా, దాదాపు 4,800 మంది ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోనున్నారు. అయితే అదే సమయంలో బాధిత ఉద్యోగులకు టెక్ రంగంలోనే అత్యంత ఆకర్షణీయమైన ఉద్యోగ విరమణ పరిహార ప్యాకేజీని ప్రకటించి సంస్థ అందరి దృష్టిని ఆకర్షించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఉద్యోగులకు అందిస్తున్న ప్రయోజనాలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులకు వారి హోదా, సేవా కాలాన్ని బట్టి గరిష్టంగా 39 వారాల ప్రాథమిక వేతనం, కంపెనీ షేర్ల ప్రయోజనాలు, ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించనున్నారు. ఉద్యోగుల తొలగింపు ప్రకటించిన తర్వాత కూడా తొలి 60 రోజుల పాటు వారు మైక్రోసాఫ్ట్ పేరోల్‌లోనే కొనసాగుతారు. ఈ కాలంలో వారికి సాధారణ వేతనం యథావిధిగా అందుతుంది. అనంతరం ఉద్యోగి హోదా, సేవా కాలం ఆధారంగా పరిహారం చెల్లిస్తారు. తక్కువ స్థాయి ఉద్యోగులకు ప్రతి ఆరు నెలల సేవకు ఒక వారం వేతనం, మధ్యస్థాయి ఉద్యోగులకు ప్రతి ఆరు నెలల సేవకు రెండు వారాల వేతనం చొప్పున అందజేస్తారు. సుదీర్ఘకాలంగా సంస్థలో పనిచేసిన వారికి గరిష్టంగా 39 వారాల వేతనం, అంటే దాదాపు తొమ్మిది నెలల జీతానికి సమానమైన పరిహారం లభించనుంది. నగదు పరిహారంతో పాటు మరిన్ని సదుపాయాలను కూడా కంపెనీ ప్రకటించింది. ఎంపికైన ఉద్యోగులకు ఆరు నుంచి పన్నెండు నెలల వరకు కంపెనీ షేర్లకు సంబంధించిన ప్రయోజనాలు కొనసాగుతాయి. అలాగే ఆరు నెలల పాటు ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పించనున్నారు. అనంతరం ఉద్యోగులు ప్రీమియం చెల్లించి మరో ఏడాది వరకు వైద్య బీమాను కొనసాగించుకునే అవకాశం ఉంటుంది. ఇటీవల ఉద్యోగాల కోతలు ప్రకటించిన ఇతర టెక్ సంస్థలతో పోలిస్తే మైక్రోసాఫ్ట్ ప్రకటించిన పరిహార ప్యాకేజీ మరింత మెరుగ్గా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో కొన్ని ప్రముఖ సంస్థలు 9 నుంచి 30 వారాల వరకు మాత్రమే వేతనాన్ని పరిహారంగా అందించగా, మైక్రోసాఫ్ట్ గరిష్టంగా 39 వారాల వేతనాన్ని ప్రకటించడం విశేషంగా మారింది. కంపెనీ ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ సంస్థ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చడం, నిర్వహణ స్థాయిలను తగ్గించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో పెట్టుబడులను పెంచడమే ఈ ఉద్యోగాల కోతల ప్రధాన ఉద్దేశమని సంస్థ తెలిపింది. ముఖ్యంగా వాణిజ్య విక్రయ విభాగం, ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది. గేమింగ్ విభాగంలోనే దాదాపు 1,600 మంది ఉద్యోగులు ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అయితే ఉద్యోగులను కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో భర్తీ చేయడానికే ఈ నిర్ణయం తీసుకోలేదని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సంస్థను పునర్వ్యవస్థీకరిస్తున్నామని మైక్రోసాఫ్ట్ యాజమాన్యం స్పష్టం చేసింది.







# రూ.55కే 1000కిపైగా లైవ్ టీవీ ఛానళ్లు

## జియో కొత్త యాడ్-ఆన్ ప్లాన్

**ముంబై, జులై 9 :** టెలికాం రంగంలో ప్రముఖ సంస్థ జియో తన వినియోగదారుల కోసం మరో ఆకర్షణీయమైన యాడ్-ఆన్ రీఛార్జ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేవలం రూ.55తో 30 రోజుల పాటు 1000కిపైగా లైవ్ టీవీ ఛానళ్లను వీక్షించే అవకాశాన్ని కల్పిస్తూ కొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ వినోదాన్ని కోరుకునే వినియోగదారులకు ఈ ప్లాన్ ప్రయోజనకరంగా ఉండనుంది. ఈ ప్లాన్‌లో సాధారణ టీవీ ఛానళ్లతో పాటు 150కిపైగా ప్రీమియం ఛానళ్లు కూడా అందుబాటులో ఉంటాయి. జియోస్టార్, సోనీ, సన్ టీవీ, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ నెట్‌వర్క్‌లకు చెందిన ప్రముఖ వినోద, వార్తలు, క్రీడలు, సినిమాలు, పిల్లల కార్యక్రమాల ఛానళ్లు ఇందులో భాగంగా లభించనున్నాయి. ఈ సేవను పొందాలంటే ముందుగా రూ.55 యాడ్-ఆన్ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకోవాలి. అనంతరం జియోటీవీ యాప్‌లో తమ జియో నంబర్‌తో లాగిన్ అయితే అదనపు రుసుము లేకుండానే 1000కిపైగా లైవ్ టీవీ ఛానళ్లను వీక్షించవచ్చు. ఓటీటీ, కేబుల్ టీవీ సేవల ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో తక్కువ ధరలో విస్తృత వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో జియో ఈ ప్రత్యేక ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా మొబైల్‌లోనే ప్రత్యక్ష టెలివిజన్ కార్యక్రమాలను వీక్షించాలనుకునే వినియోగదారులకు ఈ ప్లాన్ మంచి ఎంపికగా నిలవనుంది.

# లాభాల్లోనే ముగిసిన సూచీలు

**ముంబై, జులై 9 :** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, దేశీయ పెట్టుబడిదారుల కొనుగోళ్ల మద్దతుతో కీలక సూచీలు రోజు మొత్తం సానుకూలంగా ట్రేడయ్యాయి. ట్రేడింగ్ చివరి గంటలో లాభాల స్వీకరణ ప్రభావం కనిపించినప్పటికీ, నిఫ్టీ, సెన్సెక్స్ రెండూ లాభాలతోనే ముగిశాయి. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 50 గురువారం 80.75 పాయింట్లు (0.34 శాతం) పెరిగి 23,962.80 వద్ద ముగిసింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 238.22 పాయింట్లు (0.31 శాతం) లాభపడి 76,741.82 వద్ద స్థిరపడింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచే మార్కెట్లు సానుకూల ధోరణిలో కదిలాయి. గత ముగింపు స్థాయి 23,882.05తో పోలిస్తే నిఫ్టీ 23,928.95 వద్ద ప్రారంభమైంది. అదే విధంగా సెన్సెక్స్ కూడా గత ముగింపు 76,503.60 కంటే ఎగువన 76,576.14 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ట్రేడింగ్ మధ్యలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో నిఫ్టీ 24,134.70 పాయింట్ల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. సెన్సెక్స్ కూడా 77,326.65 పాయింట్ల వరకు ఎగబాకింది. అయితే మార్కెట్ ముగింపునకు ముందు పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు గరిష్ఠ స్థాయిల నుంచి కొంత వెనక్కి తగ్గాయి. అయినప్పటికీ రోజు ముగిసే సమయానికి కీలక సూచీలు లాభాల్లోనే నిలవడం మార్కెట్‌కు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, దేశీయ ఆర్థిక అంశాల ప్రభావంతో రానున్న రోజుల్లో కూడా మార్కెట్ కదలికలు కొనసాగనున్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# భారత్‌కు 'చావో రేవో' మ్యాచ్

## నాలుగో టీ20లో గెలుపే లక్ష్యం

### తిలక్ స్థానంలో సంజూకు అవకాశం దక్కే సూచనలు





**ముంబై, , జులై 9 :** ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వరుస పరాజయాలతో వెనుకబడిన టీమిండియా గురువారం జరిగే నాలుగో మ్యాచ్‌లో తప్పక గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో భారత్ ఓటమిపాలైంది. ప్రస్తుతం ఇంగ్లండ్ 2-0 ఆధిక్యంలో ఉండటంతో సిరీస్‌ను నిలబెట్టుకోవాలంటే ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి అయింది. ముఖ్యంగా మూడో టీ20లో భారత బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. జట్టు కేవలం 76 పరుగులకే ఆలౌటై 125 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూసింది. ఒక్క బ్యాటర్ కూడా 15 పరుగుల మార్కును దాటలేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో తుది జట్టులో కొన్ని కీలక మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన తిలక్ వర్మ స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. అభిషేక్ శర్మతో కలిసి యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఓపెనింగ్ కొనసాగించే అవకాశం ఉంది. గత రెండు మ్యాచ్‌ల్లో పెద్ద స్కోర్లు చేయకపోయినా అతని దూకుడు బ్యాటింగ్‌పై మేనేజ్‌మెంట్ విశ్వాసం ఉంచింది. మూడో స్థానంలో వికెట్‌కీపర్ ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్లుగా శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా తమ స్థానాలను నిలబెట్టుకోనున్నారు. బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్ పేస్ బాధ్యతలు పంచుకోగా, వరుణ్ చక్రవర్తి ప్రధాన స్పిన్నర్‌గా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. అంచనా భారత జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజూ శాంసన్ లేదా తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి.

# లార్డ్స్ టెస్టుకు భారత్‌కు ఎదురుదెబ్బ





**ముంబై, జులై 9:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో నిరాశపరిచిన భారత జట్టు ఇప్పుడు లార్డ్స్‌లో చారిత్రాత్మక టెస్టుకు సిద్ధమైంది. శుక్రవారం ఇంగ్లండ్‌తో జరిగే ఏకైక టెస్టులో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. అయితే మ్యాచ్‌కు ముందే భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ప్రతీకా రావల్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమైంది. గత వారం ఇండియా-ఏ, ఇంగ్లండ్-ఏ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ ప్రతీకా రావల్ మోకాలికి గాయమైంది. గాయం తీవ్రత కారణంగా ఆమె ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో లార్డ్స్ టెస్టులో ఆడే అవకాశం కోల్పోయింది. ప్రధాన కోచ్ అమోల్ మజుందార్ మాట్లాడుతూ.. ప్రతీక మోకాలికి గాయం కావడంతో కుట్లు పడ్డాయని, అందుకే ఆమెను జట్టు నుంచి తప్పించాల్సి వచ్చిందని తెలిపారు. ఆమె స్థానంలో అనుభవజ్ఞురాలైన ప్రియా పూనియాను జట్టులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే ప్రతీకా రావల్ స్థానంలో మూడో స్థానంలో ఎవరు బ్యాటింగ్‌కు దిగుతారనేది ఆసక్తికరంగా మారింది. ఈ స్థానానికి యస్తికా భాటియా, హర్లీన్ డియోల్ మధ్య పోటీ నెలకొంది. జట్టు సమతూకాన్ని దృష్టిలో పెట్టుకుని తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 150 ఏళ్ల చరిత్ర కలిగిన లార్డ్స్ మైదానంలో జరుగుతున్న తొలి మహిళల టెస్టులో ఆడే అవకాశం భారత జట్టుకు దక్కింది. టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరచి, ఈ చారిత్రాత్మక మ్యాచ్‌లో విజయంతో పర్యటనను ముగించాలని హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు పట్టుదలగా ఉంది. భారత జట్టు: స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రీచా ఘోష్ (వికెట్ కీపర్), శ్రీ చరణి, యస్తికా భాటియా (వికెట్ కీపర్), నందిని శర్మ, హర్లీన్ డియోల్, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే, స్నేహ్ రానా, ప్రియా పూనియా.

# భారత్‌కు డబ్ల్యూటీసీలో ఐదో స్థానం



**ముంబై, జులై 9:** వెస్టిండీస్-శ్రీలంక టెస్టు సిరీస్ ముగిసిన అనంతరం 2025--27 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తాజా పాయింట్ల పట్టిక విడుదలైంది. ఈ పట్టికలో 87.50 శాతం పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా రెండో, న్యూజిలాండ్ మూడో స్థానాల్లో నిలిచాయి. 58.33 శాతం పాయింట్లతో బంగ్లాదేశ్ నాలుగో స్థానాన్ని దక్కించుకోగా, భారత్ 48.15 శాతం పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు ఆడిన భారత జట్టు నాలుగు విజయాలు, నాలుగు పరాజయాలు, ఒక డ్రాతో మొత్తం 52 పాయింట్లు సాధించింది. తాజా పట్టికలో శ్రీలంక ఆరో స్థానంలో ఉండగా, ఇంగ్లాండ్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, పాకిస్థాన్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నాయి. ఓవర్‌రేట్ నిబంధనల ఉల్లంఘన కారణంగా ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్లకు పాయింట్ల కోత విధించబడింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ మిగిలిన టెస్టు సిరీస్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. రాబోయే మ్యాచ్‌ల ఫలితాలే భారత జట్టు ఫైనల్ అవకాశాలను నిర్ణయించనున్నాయి.

# తిలక్‌పై శ్రీకాంత్ అసంతృప్తి..

### సంజూకు అవకాశం ఇవ్వాలని సూచన



**ముంబై, జులై 9 :** ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు వరుస పరాజయాలు ఎదుర్కొంటుండటంతో జట్టు ఎంపిక, ఆటగాళ్ల ప్రదర్శనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఆటతీరుపై భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తిలక్ స్థానంలో సంజూ శాంసన్‌కు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన శ్రీకాంత్, తిలక్ వర్మ ప్రస్తుతం పూర్తిగా అయోమయంలో కనిపిస్తున్నాడని అన్నారు. వైస్ కెప్టెన్‌గా నియమించిన ఆటగాడిని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. తన స్థానంలో అయితే సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకుంటానని పేర్కొన్నారు. తిలక్‌కు షార్ట్ పిచ్ బంతులు బలహీనత అని తెలిసినా, అతడిని రక్షించేందుకు అక్షర్ పటేల్‌ను ముందుగా బ్యాటింగ్‌కు పంపడం సరైన నిర్ణయం కాదని శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి నిర్ణయాల ద్వారా జట్టు యాజమాన్యం తప్పుడు సంకేతాలు పంపుతోందని ఆయన విమర్శించారు. వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తిలక్ వర్మ 19, 55, 13, 24 నాటౌట్, 3 పరుగులు మాత్రమే నమోదు చేశాడు. ఐర్లాండ్‌పై చేసిన అర్ధశతకం మినహా మిగిలిన మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఇక ఇంగ్లండ్ పర్యటనలో భారత బ్యాటింగ్ విభాగం వరుసగా విఫలమవుతుండటంతో జట్టు ఎంపిక, నాయకత్వ నిర్ణయాలపై మాజీ క్రికెటర్లు, అభిమానుల నుంచి విమర్శలు పెరుగుతున్నాయి. మిగిలిన మ్యాచ్‌ల్లో టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి మార్పులు చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




# బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ వీడియోపై ఐసీసీ ఆగ్రహం..

### ఈసీబీకి నోటీసు

**లండన్, జులై 9 :** ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు మ్యాచ్ మధ్యలోనే ప్రకటించాడనే వార్త క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మ్యాచ్ కొనసాగుతున్న సమయంలో ఆయన రిటైర్మెంట్‌కు సంబంధించిన వీడియో బయటకు రావడంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డుకు నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్లు సమాచారం. ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న మూడో టెస్టు నాలుగో రోజు ఆట ప్రారంభానికి ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో బెన్ స్టోక్స్ తన సహచర ఆటగాళ్లతో ఇదే తన చివరి టెస్టు అని చెప్పినట్లు ప్రచారం జరిగింది. ఆ సమయంలో ఈసీబీ మీడియా బృందం వీడియో చిత్రీకరించగా, అదే రోజు టీ విరామం సమయంలో ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో చిత్రీకరించిన వీడియోను బహిర్గతం చేయడం ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని ఐసీసీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని ఈసీబీని కోరినట్లు సమాచారం. ఇక ఈ వివాదంపై బెన్ స్టోక్స్ కూడా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. తనపై చర్యలు తీసుకోవచ్చంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వ్యవహారంపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు. అయితే, బెన్ స్టోక్స్ రిటైర్మెంట్, ఐసీసీ చర్యలకు సంబంధించిన ఈ సమాచారం అధికారికంగా పూర్తిస్థాయిలో ధృవీకరించబడే వరకు ప్రచారంగానే పరిగణించాల్సి ఉంటుంది.

# అర్జెంటీనాకు చుక్కలు చూపించిన ఈజిప్ట్ కోచ్‌కు బంపర్ ఆఫర్

**కైరో, జులై 9 :** ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచకప్‌లో ఈజిప్ట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరచడంతో ఆ జట్టు ప్రధాన కోచ్ హెుసామ్ హసన్ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం ప్రకటించింది. జట్టు సాధించిన విజయాలు, అంతర్జాతీయ స్థాయిలో కనబరిచిన పోరాట పటిమను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మొహమ్మద్ సలా నాయకత్వంలోని ఈజిప్ట్ జట్టు 2018 తర్వాత మ-రోసారి ప్రపంచకప్‌లో పాల్గొని రౌండ్ ఆఫ్ 16కు చేరి అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా ప్రీ-క్వార్టర్‌లో అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో ఒక దశలో 2-0 ఆధిక్యంలో నిలిచి సంచలన విజయానికి చేరువైంది. అయితే అర్జెంటీనా వరుసగా మూడు గోల్స్ నమోదు చేసి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకుంది. ఓటమి పాలైనప్పటికీ ఈజిప్ట్ ఆటతీరుపై ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు హానీ అబో రిడా మాట్లాడుతూ హెుసామ్ హసన్‌తో పాటు జట్టు డైరెక్టర్ ఇబ్రహీం హసన్ ఒప్పందాల పునరుద్ధరణకు సంఘం పాలక మండలి ఆమోదం తెలిపిందని వెల్లడించారు. జట్టుకు దీర్ఘకాలిక స్థిరత్వం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 59 ఏళ్ల హెుసామ్ హసన్ 2024 ఫిబ్రవరిలో ఈజిప్ట్ జాతీయ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతని మార్గదర్శకత్వంలో జట్టు 2025 ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అధికారిక ఒప్పందం లేకుండానే జట్టుతో కలిసి పనిచేస్తున్నట్లు హసన్ గతంలో వెల్లడించిన విషయం తెలిసిందే. హసన్ శిక్షణలోనే ఈజిప్ట్ ప్రపంచకప్ చరిత్రలో తొలి విజయాన్ని నమోదు చేసింది. న్యూజిలాండ్‌పై 3-1 తేడాతో గెలిచి చరిత్ర సృష్టించింది. అనంతరం నాకౌట్ దశలో ఆస్ట్రేలియాను పెనాల్టీల ద్వారా ఓడించి ప్రపంచకప్‌లో తొలి నాకౌట్ విజయాన్ని కూడా అందుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం హెుసామ్ హసన్ కొత్త ఒప్పందం 2030 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ నిర్ణయం ద్వారా ఈజిప్ట్ ఫుట్‌బాల్ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సంఘం భావిస్తున్నట్లు సమాచారం.



చురకలు





## వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన

# చిరు షూటింగ్

### మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం

ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.

# జన నాయగన్ విడుదలకు సిద్ధం

విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.




# నేడు విడుదలవుతున్న ..లెనిన్

### మరికొన్ని డబ్బింగ్ మూవీలు కూడా సందడి

ఈ నెల రెండో శుక్రవారం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చిత్రాల సందడి నెలకొనబోతోంది. ఈ వారం టాలీవుడ్ నుంచి అఖిల్ అక్కినేని మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' నేరుగా థియేటర్లలోకి వస్తుండగా, దీనికి పోటీగా భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు కూడా రేసులో నిలిచాయి. ఇక వైవిధ్యమైన కథాంశాలతో, విభిన్న జోనర్లలో ప్రేక్షకులను అలరించేందుకు ఆసక్తికరమైన చిత్రాలు విడుదలవుతున్నాయి. అఖిల్ అక్కినేని కెరీర్‌లోనే అత్యంత రగ్గడ్ లుక్‌లో కనిపించనున్న యాక్షన్ డ్రామా 'లెనిన్'. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఒక అందమైన ప్రేమకథ హింసాత్మక మలుపులు తిరిగితే ఎలా ఉంటుందనే కథాంశంతో వస్తున్న ఈ సినిమాను నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. థమన్ ఎస్ దీనికి సంగీతం అందించారు. ఇకపోతే మైథాలజీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న చిత్రం 'వాసుదేవ సుతం'. పూరీ జగన్నాథ ఆలయంలో దాగి ఉన్న ఒక పవిత్రమైన శక్తిని రక్షించడానికి ఒక యువకుడు చేసే పోరాటమే ఈ సినిమా కథ. మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి, సుమేధా బజాజ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వైకుంఠ్ బోను దర్శకత్వం వహించగా, మణిశర్మ సంగీతాన్ని సమకూర్చారు.ఇకపోతే మలయాళంలో విడుదలై తెలుగులో రాబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'. నిసామ్ బషీర్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, ఒక భారీ బ్యాంక్ దోపిడీ కేసులో అన్యాయంగా ఇరుక్కున్న ఒక సాధారణ వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని ఎలా నిరూపించు కున్నాడు అనే కథతో సాగుతుంది. తమిళ రొమాంటిక్ కామెడీ చిత్రం 'లవ్ ఓ లవ్' కూడా నేడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. మహేష్ రాజేంద్రన్ దర్శకత్వంలో పవిష్ నారాయణన్, నాగ దుర్గ, ఆదిత్య కతిర్ నటించిన ఈ సినిమా, అప్పుల్లో మునిగిపోయిన ఒక యువకుడి ప్రేమకథ చుట్టూ తిరుగుతుంది. ఇందులో ప్రముఖ దర్శకులు సెల్వరాఘవన్, కె. ఎస్. రవికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ప్రేమ, బ్రేకప్ మరియు గుండె లోతుల్లోని భావాల సమాహారంగా వస్తోన్న భావోద్వేగభరిత చిత్రం 'హృదయం మురళి'. అథర్వ మురళి, ప్రీతి ముకుందన్ జంటగా ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కాయాదు లోహర్, నిహారిక ఎన్.ఎమ్ ఇతర పాత్రలు పోషించారు. తమిళంలో 'ఇదయం మురళి'గా, తెలుగులో




'హృదయం మురళి'గా ఈ సినిమా రిలీజ్ కానుంది. బాలీవుడ్ నుంచి నవ్వుల పండగను తీసుకురావడానికి 'ధమాల్ 4' వస్తోంది. ఇంద్ర కుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, రితీష్ దేశ్‌ముఖ్, అర్షద్ వార్సి, జావేద్ జాఫేరి, సంజయ్ మిశ్రా, రవి కిషన్ కలయికలో వస్తోన్న ఈ క్రేజీ కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమైంది. ఇలా విభిన్నమైన జోనర్లతో, భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలతో ఈ శుక్రవారం బాక్సాఫీస్ కళకళలాడబోతోంది.


# మరో సస్పెన్స్ థ్రిల్లర్.. వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.

# భారీ బడ్జెట్ చిత్రంగా టాక్సిక్

కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ప్రస్తుతం నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొల్పింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. సినిమా నిర్మాణ వ్యయం దాదాపు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, హింసాత్మక నేపథ్యం, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు ఒక పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, మొత్తం బ్జడెట్‌లో దాదాపు రూ.100 కోట్లు ప్రధాన తారాగణం, దర్శకురాలు, కీలక సాంకేతిక నిపుణుల రెమ్యూనరేషన్లకే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. హీరో యశ్ ఈ సినిమా కోసం సుమారు రూ.50 కోట్ల పారితోషికం తీసుకుంటున్నారని, అంతేకాకుండా సినిమా లాభాల్లో కూడా వాటా ఉండేలా ఒప్పందం చేసుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీకి సుమారు రూ.15 కోట్లు పారితోషికంగా అందుతున్నట్లు సమాచారం. కీలక పాత్రలో కనిపించనున్న నయనతారకు రూ.12 కోట్లు, మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్‌కి రూ.3 కోట్లు ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే తారా సుతారియా, హ్యూమా ఖురేషిలకు చెరో రూ.2 కోట్ల వరకు పారితోషికం చెల్లిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దర్శకురాలు గీతూ



మోహన్‌దాస్‌తో పాటు ఇతర కీలక సాంకేతిక నిపుణుల పారితోషికాలు కలిపితే మొత్తం రెమ్యూనరేషన్ వ్యయం రూ.100 కోట్ల మార్క్‌ను దాటే అవకాశముందని చర్చ జరుగుతోంది. కేవలం నటీనటుల పారితోషికాలే కాకుండా సినిమా నిర్మాణంపైనా భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్లు, ప్రత్యేక ఆర్ట్ డైరెక్షన్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అందుకే ఆర్ట్ డిపార్ట్‌మెంట్, యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంకేతిక అంశాలపై కూడా నిర్మాతలు భారీగా పెట్టుబడి పెడుతున్నట్లు సమాచారం

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com